ప్రజాశక్తి

ఆదివారం 3 మార్చి 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



ఉమామహేశ్వరరావును సత్కరిస్తున్న కార్మికులు

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్(సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. మున్సిపల్ కార్మికులు 16 రోజులు సమ్మె చేసి పలు డిమాండ్లను ప్రభుత్వం నుంచి సాధించుకొని, జీవోలు విడుదల అయిన సందర్భంగా కార్మికులకు అభినందన సభ శనివారం స్థానిక గాంధీపార్కులో జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికుల పోరాటానికి రాష్ట్ర స్థాయిలో నాయకత్వం వహించిన ఉమామహేశ్వరరావును, జిల్లా నేతలను మున్సిపల్ కార్మికులు పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీ ఇంజినీరింగ్, క్లాప్ డ్రైవర్లు చేసిన 16 రోజుల సమ్మె పోరాటం ఫలితంగా కనీస వేతనం రూ.21 వేలు, సంక్రాంతి కానుక రూ.1000, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఉపాధి, మట్టి ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్ 10 సంవత్సరాలు నిండితే రూ.75 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించి జీవోలు విడుదల చేసిందని తెలిపారు. కార్మికులు రెగ్యులర్ అయ్యే వరకు రానున్న రోజుల్లో జరిగే పోరాటానికి కార్మిక వర్గం ▶ 2లో

15 లక్షల మందితో సిద్ధం.!

- మేదరమెట్ల సభలో సిఎం మేనిఫెస్టోలో అంశాలను వెల్లడిస్తారు..
- వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి



సిద్ధం సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

వైఎస్ఆర్ కాంగ్రెసుపార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రానున్న ఐదేళ్ల కాలంలో చేపట్టబోయే పథకాలకు సంబంధించి మేనిఫెస్టోలో పొందుపరచబోయే అంశాలను మేదరమెట్లలో ఈ నెల పదిన జరిగే సిద్ధం సభలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తెలియజేస్తారని వైసిపి రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి తెలిపారు. మేదరమెట్ల సభకు 15 లక్షల మంది జనం వస్తారని అంచనా వేస్తున్నామని తెలిపారు. మేదరమెట్ల సిద్ధం సభకు సంబంధించిన పోస్టర్‌ను పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల సమక్షంలో శనివారం స్థానిక కెబి రెస్టారెంట్‌లో ఆవిష్కరించారు. అనంతరం సిద్ధం సభ సన్నాహక సమావేశం జరిగింది. తరువాత విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ మేనిఫెస్టో తయారవుతోందని, సరైన సమయంలో విడుదల చేస్తామన్నారు. ఈ లోపు ఈ నెల 10న జరిగే సిద్ధం ఆఖరి సభలో మేనిఫెస్టోలో పొందుపరచబోయే పలు అంశాలను ముఖ్యమంత్రి ప్రజలకు వివరిస్తారని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో ఏం చేశాం.. అధికారంలోకి వచ్చిన తరువాత రానున్న ఐదేళ్లలో ఏం చేస్తాం.. అనే విషయాలను తెలియజేస్తూ మేనిఫెస్టోను తయారు చేస్తున్నామని తెలిపారు. ఆరు పార్లమెంటు స్థానాల పరిధిలో 43 నియోజకవర్గాల నుంచి సిద్ధం ఆఖరి సభకు పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గతంలో జరిగిన మూడు సిద్ధం మహాసభల కంటే ఈ నెల 10న జరగబోయే సిద్ధం ముగింపు సభకు ప్రజలు అధికంగా రానున్నారని వివరించారు. అందుకు తగ్గట్టుగానే రవాణా, సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఇటీవల వైసిపి గ్రాఫ్ పెరిగిందన్నారు. సిద్ధం సభలకు వస్తున్న ప్రజలను చూస్తే అది అర్థమవుతోందన్నారు. ఈ నెల 13, 14 తేదీలలో ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉందని, తరువాత తమ పార్టీ ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్నదని తెలిపారు. మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గతంలో జరిగిన మూడు సిద్ధం సభల కంటే ఈ నెల 10న జరిగే సిద్ధం సభకు ప్రజలు ఎక్కువగా రానున్నారని తెలిపారు. సిద్ధం చివరి సభ కావడంతో జిల్లా నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, కాకాని గోవర్ధన్‌రెడ్డి, అంబటి రాంబాబు, ఎంపీలు గురునాథం, నందిగం సురేష్, మోపిదేవి వెంకటరమణ, రీజనల్ కో ఆర్డినేటర్ చేవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

పోలీసు అధికారులకు కొత్త చట్టాలపై శిక్షణ

ఎస్పీ వకుల్ జిందాల్



శిక్షణలో పాల్గొన్న పోలీసు అధికారులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

నూతనంగా అమలులోకి వచ్చిన మూడు కొత్త చట్టాల గురించి జిల్లాలోని పోలీస్ అధికార యంత్రాంగానికి శిక్షణ ఇచ్చినట్లు ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఈ మేరకు తిరుపతి పోలీస్ శిక్షణ కళాశాల నేతృత్వంలో గత ఫిబ్రవరి 26వ తేది నుండి మార్చి 2 వరకు ప్రతి రోజూ రెండు గంటలు 'జూమ్ కాన్ఫరెన్స్' ద్వారా ఆన్‌లైన్‌లో వర్చువల్ తరగతులు నిర్వహించారు. ఎస్పి మాట్లాడుతూ ఇటీవల భారతీయ శిక్షా స్మృతి 1860, నేర విచారణ ప్రక్రియ స్మృతి 1973, భారతీయ సాక్ష్యాధార చట్టం 1872లను భారత ప్రభుత్వం ప్రస్తుత సమాజానికి అనుగుణంగా మార్పులు చేసి వాటి స్థానాలలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం అనే నూతన ▶ 2లో



పొదిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌ప్రకాష్

రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

'ప్రవీణ్ ప్రకాష్' సుడిగాలి పర్యటన

పలు పాఠశాలల్లో వసతుల పరిశీలన

ప్రజాశక్తి-చీమకుర్తి, పొదిలి

రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ చీమకుర్తి, పొదిలి మండలాల్లో శనివారం సుడిగాలి పర్యటన చేశారు. వివిధ పాఠశాలల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. శనివారం మండలంలోని ఇలపావులూరు ప్రాథమిక పాఠశాల, గోనేపల్లివారిపాలెం ప్రాథమిక పాఠశాల, గాడిపర్తివారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పర్యటించారు. అందరూ ఊహించని విధంగా ఆయన మండలంలో మారుమూల ప్రాంతంలోని ఇలపావులూరు పాఠశాలకు వెళ్లారు. అక్కడ విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలించి, వారి సామర్థ్యాలను పరీక్షించారు. అక్కడ నుంచి నేరుగా మండల శివారు గ్రామమైన గోనేపల్లివారిపాలెం ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ పాఠశాలలో లోపాలపై పలు సూచనలు చేశారు. అనంతరం గాడిపర్తివారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. అప్పటికే సాయంత్రం మూడు గంటలు కావొస్తుండడంతో నేరుగా పొదిలి మండలం ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఇంటర్ పరీక్షలు జరుగుతున్న పొదిలి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో వసతులు సరిగా లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం దర్శి రోడ్డులోని కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి.. సిబ్బంది సమస్యలు తెలుసుకున్నారు. ఈ సమాచారం కవరేజ్ కోసం వచ్చిన మీడియాను కెజిబివి సిబ్బంది లోపలికి అనుమతించలేదు. కార్యక్రమాలలో డిఈఓ సుభద్ర, డిప్యూటీ డిఈఓ రోజ్‌రాణి, ఎంఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమానత్వం సాధించడమే లక్ష్యం

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి



మాట్లాడుతున్న రమాదేవి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

సాధించిన హక్కులు, చట్టాలను నిలబెట్టుకుంటూ సమానత్వాన్ని సాధించడం కోసం ఉద్యమించడమే నేడు మహిళల ముందున్న కర్తవ్యమని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక హర్షిణీ డిగ్రీ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ మన దేశంలో ఆధునిక భావాలను పుణికి పుచ్చుకొని అనేక మంది పురుషులు, మహిళలు స్వాతంత్రోద్యమ కాలంలోనే సమానత్వ భావజాలాన్ని ప్రచారం చేశారని తెలిపారు. సమాజం ముందుకు పోవాలంటే సగభాగంగా ఉన్న మహిళలకు అన్నింటిలో అవకాశం కల్పించాలని, తద్వారానే దేశం అభివృద్ధి చెందుతుందని నాటి ప్రజాతంత్ర వాదులు ఆశించారని ▶ 2లో

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

అంతా ఐక్యంగా ఉండి.. పోరాటాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్మికులు, ఉద్యోగుల చట్టాలపై దాడి చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమ్మె చేసి కొన్ని డిమాండ్లు సాధించుకున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు అభినందనలు తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సిఐటియు రాజీ లేని పోరాటం చేస్తోందని తెలిపారు. కార్యక్రమానికి యూనియన్ నాయకులు కొర్నెపాటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి టి మహేష్, ఎస్‌డి హుస్సేన్, యూనియన్ నాయకులు కె సామ్రాజ్యం, కె గోపి, యు రత్నకుమారి, టి విజయ, కాకుమాను వెంకటేశ్వర్లు, నూకతోటి వెంకటేశ్వర్లు, పోకల కోటేశ్వరరావు, శ్రీదేవి, శ్రీలక్ష్మి, ఎం బాబు, దివ్య, కె వంశీ, భారతి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమానత్వం సాధించడమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. అందుకోసం అనేక ఆటంకాలను అధిగమించి పోరాడారని తెలిపారు. అరెస్టులు, జైళ్లను ఎదుర్కొని సమాన హక్కుల కోసం ఉద్యమాలు చేశారని వివరించారు. సెమినార్‌కు అధ్యక్షత వహించిన ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ మార్చి ఒకటో తేదీ నుంచి 15వతేది వరకు జిల్లాలో మహిళా సమానత్వ సాధన కోసం, హింసలేని సమాజ స్థాపన కోసం ఉద్యమిద్దాం అనే నినాదంతో సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు బి గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారులకు కొత్త చట్టాలపై శిక్షణ

(మొదటిపేజీ తరువాయి)

చట్టాలను భారత ప్రభుత్వం రూపొందించడం జరిగిందన్నారు. నూతన చట్టాలు జులై 1వ తేది నుండి అమలులోకి రానున్న నేపథ్యంలో నూతన చట్టాలపై పోలీస్ అధికారులకు, సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర డి.జి.పి కె.రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు, ట్రైనింగ్ ఐజి పి.వెంకటరామిరెడ్డి ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలోని పోలీస్ శిక్షణ కళాశాలల అధికారులు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా తిరుపతి పోలీస్ శిక్షణ కళాశాల వారు చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బందికి 'జూమ్ కాన్ఫరెన్స్' ద్వారా ఆన్లైన్లో వర్చువల్ తరగతులు నిర్వహించినట్లు చెప్పారు. మొదటి దశ శిక్షణలో మొత్తం 6 జిల్లాల నుండి సుమారు 2,900 మంది తమ తమ పోలీసుస్టేషన్‌లు, అధికార కార్యాలయాల నుండే హాజరై నూతన చట్టాల గురించి తెలుసుకున్నారు. ఈ శిక్షణ తరగతులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు మొదటి దశ శిక్షణలో బాపట్ల జిల్లా నుండి బాపట్ల సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బంది, జిల్లాలోని ఇతర విభాగాల పోలీస్ అధికారులు, సిబ్బంది మొత్తం సుమారు 345 మంది హాజరయ్యారు. మార్చి 11వ తేది నుండి 16వ తేది వరకు జరగనున్న రెండవ దశ శిక్షణలో రేపల్లె, చీరాల సబ్ డివిజన్‌లలోని పోలీస్ అధికారులు, సిబ్బంది హాజరుకానున్నట్లు ఎస్‌పి తెలిపారు.

వివేకానందరెడ్డి హత్య కేసులో

జగన్‌రెడ్డి పాత్రపై విచారణ జరపాలి: టీడీపీ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్ పాత్రపై విచారణ జరపాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు డిమాండ్ చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హరిబాబు మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసమే వైఎస్ వివేకానందరెడ్డిని జగన్ ముఠాయే హతమార్చిందన్నారు. సిబిఐచే విచారణ చేయిస్తానని సునీతమ్మ అంటే జగన్ ఎందుకు ఆపారని ప్రశ్నించారు. మొదట సిబిఐ విచారణ కోరిన జగన్‌రెడ్డి తర్వాత వద్దు అనటం వెనుక కారణాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. సీఎం అయిన తర్వాత జగన్‌రెడ్డి సిబిఐ విచారణ పిటిషన్ ఎందుకు వెనక్కి తీసుకున్నారని ప్రశ్నించారు. వివేకానందరెడ్డి ఎలా చనిపోయారో జగన్‌కు బాగా తెలుసన్నారు. జగన్‌రెడ్డి సీఎం కాగానే కేసు విచారణలో పురోగతి ఎందుకు ఆగిపోయిందని ఆయన ప్రశ్నించారు. తన తండ్రికి న్యాయం చేయాలని ఆయన కూతురు సునీత పోరాడుతుంటే తమ్ముడిని సిబిఐ అరెస్టు చేయకుండా జగన్ అడ్డుపడుతున్నారన్నారు. హై ప్రొఫైల్ కేసులో కూడా ఇంత జాప్యానికి జగన్‌రెడ్డే కారణమని సునీతమ్మ కూడా ఆరోపించారని ఆయన అన్నారు. కర్నూల్‌లో అవినాష్‌రెడ్డి అరెస్టు చేయటానికి వస్తే ఉద్రిక్త వాతావరణం వైసిపి నేతలు సృష్టించారని, తన సోదరి వైఎస్ సునీతమ్మ అడుగుతున్న ప్రశ్నలకు జగన్‌రెడ్డి అండ్ కో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ చెబుతున్నట్లు పేదలకు పెత్తందారులకు మధ్య యుద్ధం కాదని, హంతకులకు రాష్ట్ర ప్రజలకు మధ్య యుద్ధం అని అన్నారు. వివేకానందరెడ్డిని గొడ్డలితో క్రూరంగా నరికి చంపిన హంతకులకు శిక్ష పడకపోతే రేపు ప్రతి పౌరుని ప్రాణాలకు కూడా రక్షణ ఉండదని అన్నారు. సునీతమ్మ న్యాయ పోరాటానికి ప్రజలు పార్టీలకతీతంగా మద్దతివ్వాలని కోరారు. సామాన్య ప్రజలకు రక్షణ కావాలంటే సునీతమ్మ చెప్పినట్లుగా జగన్‌రెడ్డిని చిత్తుచిత్తుగా ఓడించాలని ప్రజలను కోరారు. సమావేశంలో టీడీపీ నాయకులు పి నారాయణస్వామి చౌదరి, ఏ రాము, ఎన్ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

7న గిద్దలూరులో లోకేష్ శంఖారావం

ప్రజాశక్తి-గిద్దలూరు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు పట్టణంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం సభ ఈ నెల 7వ తేదీన జరగనున్నట్లు టీడీపీ గిద్దలూరు ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఒంగోలు రోడ్డు హెచ్‌పి పెట్రోల్ బంకు సమీపంలో నిర్వహించనున్న సభా ప్రాంగణ ఏర్పాట్లను అశోక్‌రెడ్డి టీడీపీ ముఖ్య నాయకులతో కలిసి శనివారం సాయంత్రం పరిశీలించారు. గురువారం ఉదయం జరిగే శంఖారావం సభకు నియోజకవర్గంలోని తెలుగుదేశం శ్రేణులు భారీ సంఖ్యలో హాజరు కావాలని అశోక్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష అట్టలు, జామెంట్రీ బాక్స్, పెన్నులను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ శనగల వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతి పరీక్షలు బాగా రాసి, మంచి మార్కులు పొంది తల్లిదండ్రులకు, పాఠశాలకు తద్వారా గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని పేర్కొన్నారు. అదేవిధంగా 10వ తరగతిలో స్కూల్ ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి 10,116 రూపాయలు, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థికి 5,116 రూపాయలు బహుమతిగా ఇస్తామని తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ వైస్ ఛైర్మన్ ఎస్ ధనలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకొని పరీక్షలు బాగా రాయాలని కోరారు. ఈ కార్యక్రమం ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల పరిషత్ కార్యాలయ ఏవో ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని అన్నారు. కార్యక్రమంలో సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ వైస్ ఛైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, రెడ్‌క్రాస్ సభ్యులు చివుకుల రామ్‌గోపాల్, కంకణంపాటి వెంకటేశ్వర్లు, కురిచేటి రమేష్, ఎస్ శ్రీనివాసరావు, షేక్ హసీనా బేగం, చలువాది చంద్రావతి, సుధారాణి, ఏపీజిపి బ్యాంక్ మేనేజర్ జనార్ధన్‌రావు, హైస్కూల్ హెడ్మాస్టర్ పెనుబోతు రామారావు, స్కూల్ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

దాతల ఔన్నత్యం సాటిలేనిది

ప్రజాశక్తి-కొండపి

కొండపిలోని గురుకుల పాఠశాలకు విద్యార్థులు పడుతున్న కష్టాలను చూసి వారి తల్లిదండ్రులు పాఠశాలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించారని, వారి ఔన్నత్యం గొప్పదని ప్రిన్సిపాల్ ఎస్ అరుణ అన్నారు. ప్రభుత్వం ఏదో చేస్తుంది అని ఎదురు చూడకుండా విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి వారికి తోచిన సహాయ సహకారాలు పాఠశాలకు అందజేశారు. జి వెంకటేశ్వర్లు పాఠశాలకు టెక్సుమో మోటర్ 5హెచ్‌పిని, ప్రింటర్ కమ్ స్కానింగ్‌ను కూడా అందజేశారన్నారు. ఏ నరసింహం ఇన్‌వర్టర్, నారాయణమ్మ 30 ట్యూబ్‌లైట్లు, పి సుమన్ 4 పెద్ద లైట్లు, జి ఏడుకొండలు స్టాండ్ ఫ్యాను, సీలింగ్ ఫ్యాన్సు, సిహెచ్ శ్రీను 30 ట్యూబ్ లైట్లు, జె స్వాతి కార్‌పెట్, విజయ్‌వర్ధన్ 10 వింటోస్, శాంతిరాజ్ రూ.10 వేలు విలువ చేసే జిప్స్ అందజేశారన్నారు. వస్తువులు అందజేసి పాఠశాల అభివృద్ధికి దోహదపడ్డ వారందరికీ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

సమిష్టిగా కృషి చేయాలి

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలంలోని అన్ని గ్రామాలలో టిడిపి నాయకులు సమిష్టిగా కృషి చేసి వచ్చే ఎన్నికలలో ఎమ్మెల్యే స్వామి గెలిపించుకోవాలని టిడిపి సీనియర్ నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావు నాయకులకు సూచించారు. మండలంలోని మూగచింతల, గుర్రపడియ, నెన్నూరుపాడు గ్రామాలలో శనివారం ఆయన టిడిపి నాయకులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఈ సారి ఎన్నికలలో ఎమ్మెల్యే స్వామిని అత్యధిక మెజార్టీటీతో గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ జి రామయ్యచౌదరి, మండల పార్టీ అధ్యక్షులు బి యలమందనాయుడు, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, ఆయా గ్రామాలలోని నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం వడ్డెపాలెం శ్రీరామ్‌నగర్ గ్రామంలో గత కొంతకాలంగా డయాలసిస్‌తో బాధపడుతున్న తన్నీరు మాధవ్‌కు శనివారం సిఎం జగన్ సహకారంతో డయాలసిస్ పైన్షన్ అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి వడ్డెర యూత్ నాయకులు తన్నీరు సురేష్, కుంచాల సాయి వేణు, వాలంటీర్ షర్మిల పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రసాద్‌రెడ్డి

పీడీసీసీ బ్రాంచి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్ద దోర్నాలలో పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి శనివారం ఆ బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బ్రాంచ్ కార్యాలయం ద్వారా రైతులకు పంట రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు, ఇతర రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఈ బ్యాంక్ సేవలు ప్రతి ఒక్కరూ పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈఒ కోటిరెడ్డి, డైరెక్టర్ బాలగురవయ్య, ఎజిఎం బాలకుమారి, బ్యాంక్ మేనేజర్ సుబ్బయ్య, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరావు, పిఎసిసి చైర్మన్ వెన్నా కాశిరెడ్డి, పిఎసి సీఈఓ గురువారావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ చిత్తూరి హారిక, మండల వైసీపీ కన్వీనర్ గంటా రమణారెడ్డి, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మా యల్లేష్, బట్టు సుధాకర్‌రెడ్డి, అంబటి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే బడుగుల అభివృద్ధి

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

కాంగ్రెస్ పార్టీతోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ హజరత్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. నాడు ఇందిరాగాంధీ పాలనలో 20 సూత్రాల పథకం ప్రవేశపెట్టి పేదలకు మేలు చేకూర్చారని, కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనా కాలంలోనే పేదలు, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి బాటలు వేశారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం వారి వారి వ్యక్తిగత ప్రయోజనాల కోసం పని చేస్తున్నాయి తప్ప పేద ప్రజల సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. పేదల బతుకులు బాగుపడాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాల్సి ఉందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు.

అరాచక పాలనకు చరమగీతం పాడండి

మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల



మాట్లాడుతున్న కందుల

ప్రజాశక్తి-పొదిలి

రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనకు రాబోయే ఎన్నికల్లో చరమగీతం పాడాలని మార్కాపురం మాజీ శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఉప్పలపాడు, గోగినేనివారి పాలెం, అన్నవరం గ్రామాల్లో పర్యటించారు. గ్రామలలోని తెలుగు దేశం నాయకులు, బూత్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అరాచకాలకు హద్దు లేకుండా పోయిందని, ఈ అరాచక పాలనకు చమరగీతం పాడాలంటే వచ్చే ఎన్నికల్లో కుల మతాలకతీతంగా తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అసంపూర్తిగా ఉన్న వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని, నిర్వాసితుల నిధులు వెంటనే విడుదల చేయిస్తామని అన్నారు. ఇటీవల చంద్రబాబు హామీ ఇచ్చిన విధంగా మార్కాపురం ప్రత్యేక జిల్లా సాధిస్తానని, ఈ నియోజకవర్గాన్ని సంపూర్ణంగా అభివద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమాలలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, జిల్లా నాయకులు యర్రంరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు మీగడ ఓబుల్ రెడ్డి, మాజీ సర్పంచ్ కాటూరి నారాయణ ప్రతాప్, కల్లూరి సోమయ్య, మండాది పాపిరెడ్డి, శ్రీనివాస రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, కోటిరెడ్డి, కొత్తపులి వెంకటేశ్వ రెడ్డి, తెలుగుదేశం నాయకులు గుంటూరి వెంకటేశ్వర్లు, గురక లక్ష్మణ బలగాని నరసింహా రావు పాల్గొన్నారు.

16వ డివిజన్‌లో 'జనం కోసం జనార్థన్'

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే నారా చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేసుకోవటం అత్యవసరమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తెలిపారు. జనం కోసం జనార్ధన్, బాబు షఉరిటీ భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమం శనివారం ఒంగోలు నగరంలోని 16వ డివిజన్ ఆరవ కాలనీలో నిర్వహఙంచారు. కార్యక్రమం లో భాగంగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు ఇంటింటికి వెళ్లి మహిళలు, యువతతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. డివిజన్ లో మినీ మేనిఫెస్టో కరపత్రాలను అందజేసి తెదేపా అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ చంద్రబాబు ఒక విజన్ ఉన్న నాయకుడని..రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు మళ్లీ సిఎం కావాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో తెదేపా గెలుపు అత్యవసరమని, ఇందుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. కార్యక్రమం లో కొఠారి నాగేశ్వరావు, బండారు మదన్,పి వెంకటేశ్వరెడ్డి ,16వ డివిజన్ అధ్యక్షులు ఉంగరాల రమణయ్య, గొల్లగమూడి వెంకటేశ్వర్లు, మాదాసు చంద్ర, రాపూరి శ్రీను, కోడియన్ ఏకాంబరం పాల్గొన్నారు.



జనార్ధన్‌ను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

షార్ట్‌సర్క్యూట్‌తో కూలీల గుడిసెలు దగ్ధం

అగ్నికి ఆహుతైన రూ.4 లక్షల ఆస్తి

ప్రజాశక్తి-కొండపి



కరెంటు షార్ట్ సర్క్యూట్ కారణంగా సిలిండర్లు పేలి గుడిసెలు దగ్ధమైన సంఘటన కొండపి మండలంలోని కట్టుబడి పాలెంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. కట్టుబడిపాలెం గ్రామానికి చెందిన అనుమాల వెంకటేశ్వర్లు అనే రైతుకు చెందిన పొగాకు బ్యారన్ దగ్గరకు బల్లికురవ నుంచి 9 కుటుంబాలకు చెందిన 24 మంది కూలీలు వచ్చారు. రోజులాగానే శనివారం కూడా కూలీలు మొత్తం పచ్చాకు కొట్టడానికి వెళ్లారు. ఉదయం 7 గంటల ప్రాంతంలో చిన్న చిన్న మంటలను సమీపంలో ఉన్నవారు చూశారు. వారు వెంటనే అక్కడి చేరుకునేలోపు కూలీల గుడిసెలో ఉన్న 5 సిలిండర్లు పేలడంతో పెద్దపెద్ద మంటలు వచ్చాయి. పక్కనే ఉన్న అనుమాల వెంకటేశ్వర్లు క్యూరింగ్ అయిన రేకులలో ఉంచిన ఆకు కూడా పూర్తిగా అగ్నికి ఆహుతి అయింది. ఈ సంఘట జరిగిన సమయంలో ఆయా గుడిసెలలో ఎవరు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. అనుమాల వెంకటేశ్వర్లు క్యూరింగ్ అయిన రేకలలో ఉంచి ఆకు విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉందని, కూలీల గుడిసెలలో ఉన్న వస్తువులు సుమారు రూ.2 లక్షల విలువైన వస్తువులు కాలిపోయాయని, మొత్తం రూ.4.50 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. టంగుటూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

నేల బావిలో వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

నేల బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం తేలియాడుతుండటం మార్టూరులో కలకలం రేపింది. అర్బన్ సీఐ ఎస్వీ రాజశేఖర్ రెడ్డి కథనం ప్రకారం.. స్థానిక పెద్ద కూరగాయల మార్కెట్ సమీపంలో లంబాడి తండాకు వెళ్లే దారిలో పొలాల్లో ఉన్న నేల బావిలో పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం తేలియాడుతుండటాన్ని గుర్తించిన గొర్రెల కాపరులు శనివారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ బావిలో నుంచి మతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎక్కడైనా హత్య చేసి ఇక్కడ బావిలో పడవేశారా? ఆత్మహత్యా? అనే విషయం పోస్టుమార్టం నివేదిక అనంతరం వెల్లడి అవుతుందని సిఐ తెలిపారు.

.గ్రంథాలయంలో విద్యార్థులకు సభ్యత్వం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని శాఖా గ్రంథాలయంలో శనివారం కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు సోషల్ ఉపాధ్యాయుడు ఎలీషాబాబు ఆధ్వర్యంలో సభ్యత్వాలు తీసుకున్నారు. వేసవిలో అనేక రకాల పుస్తకాలు ఇండ్లకు తీసుకెళ్లి చదువుకోవాలనే ఉద్దేశంతో వీరంతా సభ్యత్వాలు కట్టారు. ఈ సందర్భంగా గ్రంథపాలకురాలు కటికల రఘూన్సీ సభ్యత్వాలు తీసుకున్న విద్యార్థులను అభినందించారు. తోటి విద్యార్థులకు సమాచారం తెలియజేసి సభ్యత్వం తీసుకునేలా కృషి చేయాలని కోరారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

పోలియో చుక్కలు వేయించాలని ర్యాలీలు

ప్రజాశక్తి-ఒంగోలు

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయం పల్స్ పోలియో అవగాహన కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ వద్ద ఏర్పాటుచేసిన ర్యాలీని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీన జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలని ఆయన కోరారు.

కనిగిరి: పల్స్ పోలియో కార్యక్రమాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్య శాఖ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శనివారం కనిగిరి డివిజన్ కేంద్రమైన కనిగిరిలో పల్స్‌పోలియోపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ పచ్చ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. పోలియో చుక్కలు వేయించండి, పోలియో రహిత ఆంధ్రప్రదేశ్ మన ధ్యేయం, పోలియో చుక్కలు వేయిద్దాం పోలియోను తరిమేద్దాం, నిండు జీవితానికి రెండు చుక్కలు, అనే నినాదాలతో కనిగిరి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్‌గఫార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్

డాక్టర్ సృజన, వివిపి కమ్యూనిటీ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ అబ్దుల్ కలాం మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియార్వ్హా నందా, డాక్టర్ ఫణి, ఎస్‌బిసిసి జిల్లా సభ్యులు, కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సార్డ్స్ కోఆర్డినేటర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

గిద్దలూరు: పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ తమవంతు సహకారం అందించాలని గిద్దలూరు సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ సుమయ పిలుపునిచ్చారు. ఈ నెల మూడో తేదీ ఆదివారం జరగనున్న జాతీయ పల్స్ కార్యక్రమం సందర్భంగా ప్రకాశం జిల్లా గిద్దలూరు సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ సుమయ ఆధ్వర్యంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణంశెట్టిపల్లె మెడికల్ ఆఫీసర్ శ్రీధర్‌రెడ్డి, కోటగడ్డ అర్బన్ హెల్త్ క్లినిక్ డాక్టర్ మహబూబ్ షరీఫ్, నంద్యాల రోడ్డు అర్బన్ హెల్త్ క్లినిక్ డాక్టర్ భార్గవ రంగారెడ్డి, కృష్ణంశెట్టిపల్లె, సంజీరావుపేట, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, హెల్త్ అసిస్టెంట్లు, వైద్య సిబ్బంది ఏఎన్‌ఎంలు, ఆశలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొమరోలు: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక ఎస్‌బిఎన్‌ఆర్‌ఎం పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ చైతన్య దీపక్, ఎస్‌బిఎన్‌ఆర్‌ఎం స్కూల్ యాజమాన్యం నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: ఈ నెల 3వ తేదీన జరిగే పల్స్‌పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ ఎస్వీ బాలయ్య, డాక్టర్ సురేఖ కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీని వైద్య అధికారులు డాక్టర్ ఎస్వీ బాలయ్య, డాక్టర్ సురేఖ ప్రారంభించారు. ఈ ర్యాలీ బస్టాండ్ సెంటర్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ రత్నమ్మ, పిహెచ్‌ఎన్ శైలజ, సూపర్‌వైజర్లు శ్యామలాదేవి, ప్రతాపరెడ్డి, సిబ్బంది, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: పెద్దదోర్నాలలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శనివారం సిహెచ్‌ఓ మంత్రునాయక్ అధ్యక్షతన ఆశాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రూనాయక్ పల్స్ పోలియోపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పోలియో నిర్మూలనకు కృషి చేయాలని చెప్పారు. ఆదివారం ఉదయం ఆరు గంటలకే వారికి కేటాయించిన బూత్‌లలో అందుబాటులో ఉండి ఐదు సంవత్సరాలలోపు పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేయాలని తెలిపారు. ఈ



సమావేశంలో మాట్లాడుతున్న దామర్ల శ్రీకృష్ణ

అసెంబ్లీ సీటు బీసీలకు కేటాయించాలి

ప్రజాశక్తి - చీరాల

చీరాల అసెంబ్లీ సీటు ప్రధాన రాజకీయ పార్టీలు అన్నీ బిసిలకు కేటాయించాలని పలువురు బిసి నేతలు కోరారు. స్థానిక అంబేద్కర్ భవనంలో ప్రజా సంఘాలు, దళిత సంఘాలు, బీసీ సంఘాల నాయకులు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం శనివారం నిర్వహించారు. చీరాల నియోజకవర్గంలో మొదటి నుంచి బీసీలకే సీటు ఇచ్చేవారని అన్నారు. అయితే క్రమేపి బీసీలను పక్కనపెట్టి ఓసీలకు, బయటి నుంచి వచ్చిన వ్యక్తులకు కేటాయించి స్థానికులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. అన్ని రాజకీయ పార్టీలు స్థానిక బీసీలకు కేటాయిస్తేనే ప్రజల మద్దతు ఉంటుందని అన్నారు. లేకుంటే ఓడిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర, జూలియన్, దామర్ల శ్రీకృష్ణ, అవ్వారు ముసలయ్య, బాబురావు, ధర్మ, శాస్త్రి, వాసు, గుమ్మడి ఏసురత్నం, షేక్ జిలాని పాల్గొన్నారు.



రైతులకు డ్రమ్ములు, పరదాలు అందజేస్తున్న వాణిశ్రీ

రైతులకు డ్రమ్ములు అందజేత

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని కోనేటిపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ఉచితంగా 200, 100 లీటర్ల డ్రమ్ములు, రెండు పరదాలను ఉచితంగా ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాణిశ్రీ చేతుల మీదగా శనివారం 177 మంది రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రోత్సాహంగా వీటిని అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన పానుగంటి సాంబశివరావుకు చెందిన ఆవులు చింతమోటు గ్రామానికి చెందిన ఐసిఆర్పి షాపుకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఐసిఆర్పి ఝాన్సీ, శివనాగేశ్వరమ్మ, బి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



గ్రామసభలో ఎఒ వేమూరి రమేష్‌బాబు

పంట నమోదు జాబితాపై గ్రామసభ

ప్రజాశక్తి - నగరం

మండలంలోని అన్ని గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో సోషల్ ఆడిట్ కొరకు పంట నమోదు జాబితాలను రైతులు తనిఖీ కొరకు ప్రదర్శించినట్లు ఎఒ వేమూరి రమేష్‌బాబు తెలిపారు. పంట నమోదు చేసుకున్న రైతుల వివరాలు సరి చూసుకోవాలని కోరారు. బోరమాదిగపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద పంట నమోదు వివరాలపై శనివారం గ్రామ సభని నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచ్ చందోలు దేవదాసు, ఉప సర్పంచ్ నల్లూరి రత్నబాబు, వ్యవసాయ సహాయ సంచాలకులు సయ్యద్ అక్తర్ హుస్సేన్, ఎఇఒ ఎం లీల, వీరవరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - కొండపి

స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. 313మంది విద్యార్తులు పరీక్షలు రాయాల్సి ఉండగా 301మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మిగిలిన 12మంది గైరుహాజరు అయ్యారని చీఫ్ సూపర్‌నెండెంట్, కళాశాల ప్రిన్సిపాల్ ఎం వెంకటేశ్వర్లు తెలిపారు.

అదనపు తరగతి గదులు ప్రారంభం

ప్రజాశక్తి - పొన్నలూరు

మండలంలోని చెన్నుపాడు జెడ్‌పి ఉన్నత పాశాల్లో నాడు - నేడు పనుల క్రింద రూ.1.33కోట్లుతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను పాఠశాల అభివృద్ధి కమిటి చైర్మన్ వెన్నపూస చెన్నారెడ్డి నిర్మించారు. ఈ భవనంనుకొండేపి వైసిపి ఇన్‌చార్జి, పట్టణ అభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శనివారం ప్రారంభించారు. నాడు - నేడు క్రింద పూర్తి స్థాయిలో నిధులు మంజూరు కాకపోయినప్పటికీ చైర్మన్ సొంత నిధులతో భవనం పూర్తి చేయడం అభినందనీయమని అన్నారు. సిఎం జగనన్నా నాడు - నేడు పథకం నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. విద్యార్థులకు అమ్మఒడి, ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ ఏర్పాటు చేసిన ఘతన సిఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. విద్యా కమిటి చైర్మన్ తనయుడు రమేష్‌రెడ్డి తన సొంత నిధులతో సరస్వతి విగ్రహం పాఠశాల్లో ఏర్పాటు చేశారని అన్నారు. పిల్లలకు నాణ్యమైన ఆహారం, ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు తన సొంత నిధులతో ప్రోత్సహాక బహుమతులు ఇవ్వడం సంతోషమని అన్నారు. పాఠశాల హెచ్‌ఎం ఎ వేణు గోపాల్, అధ్యాపక సిబ్బంది రమేష్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ కె బాలకోటిరెడ్డి, వెన్నపూస చెన్నారెడ్డి, జడ్‌పిటిసి బి వెంకటేశ్వర్లు, ఎంపిపి కె మాధవ, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

ప్రతి కుటుంబానికీ సంక్షేమం

ప్రజాశక్తి - వేటపాలెం

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైసిపి ఇన్చార్జి కరుణ వెంకటేష్ బాబు అన్నారు. మండలంలోని రామన్నపేట పంచాయతీలో గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 75శాతం గడప గడపకి కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అనుకోని సంఘటన వలన తన కాలికి దెబ్బ తగలడంతో కొంతమేర తిరగలేకపోయినట్లు తెలిపారు. కార్యక్రమంలో మల్లెల లలితరాజశేఖర్, వైసిపి మండల అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, సర్పంచ్ కందేటి రమణ, ఉప సర్పంచ్ దంతం వెంకట సుబ్బారావు, జెసిఎస్ మండల ఇంచార్జీ లేళ్ల శ్రీధర్, జిల్లా కార్యదర్శి రొండా భరత్, యువత అధ్యక్షులు ఆవుల అశోక్, ఆర్బికె చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, సీత మహాలక్ష్మి, అందే కృష్ణ, జంగిలి రామారావు, కట్టా గంగయ్య, కర్ణ లక్ష్మరావు, వేటగిరి సంజీవరావు, పృధ్వి చంద్రమోహన్, సాధు రాఘవ, షేక్ ఖాదర్, నర్మద ప్రశాంతి, పొట్లూరి మహా లక్ష్మయ్య, గౌరవబత్తిన ప్రశాంతి, దంతం హనుమంతు, కర్ణ ప్రసాద్, గౌరవబత్తిన రవి, బండికళ్ళ నరేష్, జమ్మి ప్రసాదరెడ్డి, షేక్ అజీజుల్లా, బుర్ల శివ, షేక్ హాలీ, లేళ్ళ భాస్కరరావు, కోటి స్వామిగుప్తా, షేక్ సాలేహా, మురళి, బుద్ధి రవి, ఎఒ కాశీ విశ్వనాథ్, ఎపిఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న కరణం వెంకటేష్

సామాజిక రుగ్మతలకు చదువే ఔషధం

ప్రజాశక్తి - నగరం

బాలల హక్కుల అమలుకు విఘాతం కలిగిస్తున్న బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహ వ్యవస్థ, బాలలపై లైంగిక వేధింపులు, బాలల అక్రమ రవాణా వంటి అపరిష్కృత సమస్యలన్నిటిని రూపుమాపడానికి సమాజాన్ని విద్యా వంతం చేయడం ఒక్కటే మార్గమని ఎంపిపి చితల శ్రీకృష్ణయ్య అన్నారు. నిరక్షరాస్యత అనేది లేకుండా చేయాలని అన్నారు. నిరుపేదల్ని విద్యావంతులుగా మార్చడం ద్వారా అన్ని రుగ్మతలకు చరమగీతం పాడొచ్చని అన్నారు. ప్రభుత్వం పేదల అభ్యున్నతికి కట్టుబడి ఉందని అన్నారు. 27 సంక్షేమ పథకాల అమలు చేస్తుందని అన్నారు. ప్రభుత్వ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రత్నకుమారి, అంగన్‌వాడీ సూపర్వైజర్ సునీత మాట్లాడుతూ బాల్య వివాహాలను నిరోధించడంలో తమ శాఖ కృషి చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో సిఫార్డు స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ కొమరగిరి నాగేశ్వరరావు, బేతపూడి నాగేంద్రరావు, పెట్ల మరియజ్యోతి, సరిత, జస్టిస్ ఫర్ చిల్డ్రన్ జిల్లా కోఆర్డినేటర్ ప్రభాకరరావు పాల్గొన్నారు.



సమావేశంలో ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య

యానిమేటర్లు సమావేశాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

డ్వాక్రా యానిమేటర్లు తప్పనిసరిగా ప్రతినెల గ్రూపు సభ్యులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని మండల సమైక్య ఎపీఎం జి శ్రీమన్నారాయణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం విఒఎలకు గ్రామైక సంఘ సభ్యులకు సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు మండల సమైక్య అధ్యక్షురాలు జాలాది ధనలక్ష్మి అధ్యక్ష వహించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో శ్రీనిధి మేనేజర్ పిల్లి అశోక్, సిసి బి శ్రీనివాసరావు, ఎంటి బాల, శివ నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో ఎపిఎం శ్రీమన్నారాయణ

మద్దిపాడు ఎస్ఐగా మహేష్

ప్రజాశక్తి - మద్దిపాడు

నూతన ఎస్సైగా మహేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన ఎస్ఐ శ్రీకాంత్ ఒంగోలు టూ టౌన్‌కి బదిలీ అయ్యారు. ప్రస్తుత ఎస్సై మహేష్ 2014లో ఇదే స్టేషన్లో విధులు నిర్వహించారు. మరలా ఇక్కడ పని చేయటం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా గ్రామాల్లో శాంతి బద్రతలకు సహకరించాలని కోరారు. ఎన్నికలకు సహకరించాలని కోరారు. సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలుస్వీకరిస్తున్న ఎస్ఐ మహేష్



పేదలకు ఆర్థిక సాయం చేస్తున్న ఘంటా అనీల్

ప్రోత్సహించేందుకే నగదు బహుమతి

ప్రజాశక్తి - చీరాల

విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ప్రతిభ కనబర్చి ఘంటా విజ్ఞాన నగదు ప్రోత్సాహం అందుకోవాలని పద్మ భాస్కర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఘంటా అనిల్ కుమార్ అన్నారు. కారంచేడు మండలంలో 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మొదటి, 2వ, 3వ స్థానం విద్యార్థులకు ఘంటా విజ్ఞాన నగదు ప్రోత్సాహకాలు అందించనున్నట్లు తెలిపారు. విద్య ద్వారానే ఉన్నత స్థానాలకు చేరుతారని అన్నారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుల, మతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు అన్నారు. పర్చూరుకు చెందిన జిజికె టుబాకో కంపెనీ అధినేత ఘంటా గోపాల కృష్ణయ్య చౌదరి మనుమడు ఘంటా అశోక్ బాబు జ్ఞాపకార్థం ఈ విద్య సంవత్సరంలో కారంచేడు మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో చదివే 10వ తరగతి విద్యార్థులకు ఘంటా విజ్ఞానం నగదు ప్రోత్సాహం అందిస్తున్నామని అన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అభివృద్ధి పనులపై బలరామకృష్ణమూర్తి సమీక్ష

పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని రామకృష్ణాపురం పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తాజా మాజీ ఎంఎల్ఎ కరణం బలరామ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని ఆయన శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందిస్తున్న రెవెన్యూ సేవలను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. అభివృద్ధి పనుల వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయితీ రాజ్ డిఈ శేషయ్య, వైసిపి మండల అధ్యక్షులు ఆసాది అంకాళరెడ్డి, దివి జయరాం, పృధ్వి ధనుంజయ పాల్గొన్నారు.



కంది రైతులతో మాట్లాడుతున్న ఎఒ విజయ్‌కుమార్

కొండపిలో కందుల కొనుగోళ్లు

ప్రజాశక్తి - కొండపి

మండలంలో కందులు పండించన రైతులు సొసైటి ఏర్పాటు చేసుకుని కందుల కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాలని ఎఒ డి విజయకుమార్ తెలిపారు. మండలంలోని 14ఆర్‌బికేల్లో కందులు పండించిన రైతులు వివరాలు ప్రచురించినట్లు తెలిపారు. ఖరీఫ్ 2023 - 24 సంవత్సరంనకు సంబందించిన కందుల కొనుగోలు కేంద్రం కొండపి పిఎసిఎస్ ద్వారా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ద్వారా కందులు అమ్ముకోదలిచిన రైతులు తమ ఆర్‌బికే పరిధిలోని విఎఎలకు వివరాలను అందచేయాలని కోరారు. ప్రైవేటు వ్యాపారస్తులను ఆశ్రయించి నష్టపోకుండా ప్రభుత్వం ఆన్‌లైన్ మార్కెట్ ధరకు కొనుగోలు చేసే విదంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. జెసి పర్యవేక్షణలో కందులు విక్రయించిన రైతులకు 3 రోజుల్లో తమ ఖాతాకునగదు బదిలీ చేస్తామని తెలిపారు. కావున మండలంలోని అన్ని గ్రామాల కంది రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు.

నిలిచిన నీటి సరఫరా

ఇబ్బందుల్లో ప్రజలు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరిలో గత 15 రోజులుగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సిపిఎం జిల్లా నాయకులు పీవీ శేషయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిల్లులు రాకపోవడం, ఇకపై బిల్లులు వస్తా యన్న నమ్మకం లేకపోవడంతో నీటి సరఫరాను కాంట్రాక్టర్లు నిలిపి వేశారని అన్నారు. మున్సిపల్ వారు ట్యాంకర్ నీటికి 400 రూపాయలు చెల్లిస్తున్నారని, సాధారణ జనం గోడు వినే నాథుడే కరువయ్యారని అన్నారు. గత వారం రోజులుగా ఎండల తీవ్రత పెరిగిందని, బోర్లలో నీటిమట్టం పడిపోయిందని, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాపై ఆధారపడిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు వచ్చే ఎన్నికల్లో గెలుపు సాధించేందుకు అవసరమైన వ్యూహాల్లో మునిగిపోయారన్నారు. దినపత్రికల్లో ఒక పార్టీ నుంచి మరో పార్టీకి వలసలు ప్రధాన వార్తలు అయ్యాయి తప్ప ప్రజల ఇబ్బందుల వైపు దృష్టి సారించడం లేదన్నారు. క్షేత్రస్థాయి ప్రజలను కలిసి ప్రజల ఇబ్బందులను తెలుసుకొని సమస్య పరిష్కారానికి అవసరమైన కార్యాచరణ చేపట్టడం తమ బాధ్యతని ప్రజాసంఘాలు గుర్తించకపోవడం దారుణం. ప్రతిపక్షం రాజధాని సినిమాను, అధికారపక్షం వ్యూహం సినిమాను థియేటర్లలో ఉచితంగా ప్రదర్శించి ప్రజలకు వినోదం పంచుతున్నాయని అన్నారు. మునిసిపాలిటీ పాలక వర్గం మొక్కుబడి సమావేశం నిర్వహిస్తుంది తప్ప, నీటి ఎద్దడి సమస్యను తమ అజెండాలో చేర్చి చర్చించకపోవడం, పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోకపోవడం బాధ్యత రాహిత్యమని అన్నారు. తక్షణమే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు.

సిఐటియు జిల్లా తరగతులను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

సిఐటియు ప్రకాశం జిల్లా శిక్షణ తరగతులు మార్కాపురం పట్టణంలో ఈనెల మార్చి 16,17 తేదీల్లో జరుగుతున్నాయని సిఐటియు జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం నందు జిల్లా శిక్షణ తరగతులు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు డీకేఎం రఫీ మాట్లాడుతూ కార్మిక, ఉద్యోగ హక్కుల కోసం నిరంతరం సిఐటియు పోరాడుతుందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను హరించే ప్రయత్నాలను సిఐటియు విశాల ఐక్య పోరాటాల ద్వారా ప్రతిఘటిస్తుందని, హక్కుల కోసం పోరాడుతున్న వారికి సంఘీభావం తెలియజేస్తూ వారికి అండగా నిలబడుతుందని అన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షణ కోసం విశాల ఉద్యమాలు సిఐటియు నడుపుతుందని అన్నారు. స్కీం వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలని స్కీములకు నిధులు పెంచాలని సిఐటియు ఉద్యమం చేస్తుందని అన్నారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని,అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేసి వారి హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. అనునిత్యం ఉద్యోగులు కార్మికుల కోసం పోరాడుతున్న సిఐటియుని ఆదరించాలని సిఐటియు నిర్వహణకు తోడ్పడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కే సుబ్బరాయుడు, పి.రుబెన్ మిడ్ డే మిల్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు టి గురునాథం, మండల నాయకులు జె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురంలో 'అన్నా' ఎన్నికల ప్రచారం

పాల్గొన్న ఎపిఐఐసి చైర్మన్ జంకె వెంకటరెడ్డి



ప్రచారం ప్రారంభించిన అన్నా

ప్రజాశక్తి-మార్కాపురం: వైసిపి మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు ఎన్ని కల ప్రచారాన్ని శనివారం ప్రారంభిం చారు. మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డులో గల నాగులపుట్ట ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో గల చెన్నరాయునిపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఎపిఐఐసి చైర్మన్ జంకె వెంకటరెడ్డి పాల్గొన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి వివక్ష లేని పాలన అందించారని, ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ కన్వీనర్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, మున్సిపల్ 2వ వైస్ చైర్మన్ సిహెచ్ అంజమ్మ శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్, మాజీ ఎఎంసి చైర్మన్‌లు గుంటక సుబ్బారెడ్డి, గొలమారి శ్రీనివాసరెడ్డి, 14వ వార్డు కౌన్సిలర్ బుర్రి ఎల్లమ్మ, ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు.

బీసీలకు ప్రాధాన్యం ఇచ్చే వారికే ఓటేస్తాం

ప్రజాశక్తి-గిద్దలూరు

బీసీలకు ప్రాధాన్యత ఇచ్చే నాయకులకే ఓటేస్తామని బీసీ సంఘ నాయకులు అన్నారు. శనివారం పట్టణంలో జరిగిన బీసీ సంఘ సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అత్యధిక ఓటు బ్యాంకు ఉన్న బీసీలను ప్రతిసారీ మోసం చేస్తూ అగ్రకులాల వ్యక్తులే రాజ్యాధికారం దక్కించుకుంటున్నారని మండిపడ్డారు. ఇంకెన్నాళ్లు బీసీలను మోసం చేస్తూ రాజకీయ పల్లకిపై కూర్చుని పెత్తనం చలాయిస్తారని మండిపడ్డారు. నియోజకవర్గంలోని ప్రధాన పార్టీలు ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే బీసీలకు సముచిత స్థానం కల్పిస్తామని చెప్పి.. తమ ఓట్లతో గెలిచి ఆ తరువాత మోసం చేస్తున్నాయని విమర్శించారు. ప్రస్తుతం బీసీ కులానికి చెందిన కంచర్ల కోటయ్య గౌడ్‌కు గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవి కేటాయించినప్పటికీ ఆయనకు ప్రభుత్వ కార్యక్రమాలలో కనీస ప్రొటోకాల్ కూడా దక్కకపోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం పదవి కేటాయించినప్పటికీ స్థానిక నాయకులు బీసీ కులానికి చెందినవాడు కావడంతో తొక్కేస్తున్నారని అన్నారు. అలాగే అగ్రకులానికి చెందిన వ్యక్తి తప్పుడు పత్రాలతో బీసీనని చెప్పుకుంటూ నగర పంచాయతీ చైర్మన్ పదవి పొందాలనుకోవడం, తాము రాష్ట్ర స్థాయిలో ఆ అగ్రకులానికి చెందిన వ్యక్తి గుట్టు రట్టు చేయడంతో తిరిగి తమకు నగర పంచాయతీ చైర్మన్ పదవి బీసీలకు దక్కిందని, పదవి దక్కినా కానీ నేటికీ పాలక పగ్గాలు మాత్రం అగ్రకులాల చేతిలో ఉండిపోయాయని వారు వాపోయారు. వైసీపీకి చెందిన సీనియర్ నాయకులు బీసీకి చెందిన కటారు రాజా అరుణ్ కుమార్ యాదవ్ పార్టీకి పది సంవత్సరాలుగా సేవ చేసినప్పటికీ నేటికీ ఏ పదవి దక్కలేదని అన్నారు. గతంలో కూడా స్థానిక ఎమ్మెల్యే గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ తమకు కేటాయిస్తానని బీసీ ఓట్లతో మున్సిపల్ ఎన్నికలలో విజయం సాధించి ఆ తరువాత మాట తప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నియోజకవర్గ గెలుపునకు కీలకమైన బీసీలకు ప్రాధాన్యం ఇచ్చేవారికి తాము కట్టుబడి విజయం చేకూరుస్తామని, లేకపోతే వారికి ఓటమి తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో కంచర్ల కోటయ్య గౌడ్, ఆకుమల్ల కోటేశ్వరరావు, కొత్తకోట పెద్దిరాజు, జమ్మయ్య, రాజయ్య తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

సుబ్బారావును పరామర్శించిన ఎమ్మెల్యే అన్నా

ప్రజాశక్తి-పొదిలి

అనారోగ్యంతో బాధపడుతున్న పొదిలి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, స్థానిక ఎస్‌వికెపి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ గునుపూడి చెంచు సుబ్బారావు(జిసి)ను వైసిపి మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు శనివారం పరామర్శించారు. ఒంగోలు సంఘమిత్ర హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న జిసి సుబ్బారావును పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అన్నా వెంట పొదిలి మాజీ ఏఎంసీ చైర్మన్ రమణారెడ్డి ఉన్నారు.

తేళ్ల పాపయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-సంతనూతలపాడు



నివాళి అర్పిస్తున్న మంత్రి నాగార్జున

మండలంలోని మంగమూరు గ్రామ వైసీపీ నాయకులు తేళ్ల వీరభద్రయ్య తండ్రి తేళ్ల పాపయ్య మృతికి పలువురు నివాళి అర్పించారు. ఆయన గృహానికి వెళ్లి మతదేహానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ మేరుగు నాగార్జున, వైసీపి మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, ఎంపిపి బుడంగుంట విజయ, నాయకులు బుల్లెట్ కృష్ణారెడ్డి, నూకతోటి ఈశ్వరరావు, స్థానిక నాయకులు తేళ్ల వీరభద్రయ్య తదితరులు ఉన్నారు.

ఈ క్రాప్ నమోదు: ఎఒ

ప్రజాశక్తి-అర్థవీడు



ఈ క్రాప్ జాబితాను ప్రదర్శించిన దృశ్యం

ఈ రబీ సీజన్‌లో మండలంలోని అన్ని గ్రామాలలో 5,728 ఎకరాల ఈ క్రాపింగ్ నమోదు చేశామని మండల వ్యవసాయ అధికారి ఎస్‌కె మహమ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల ఈకేవైసీ 98 శాతం పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద సామాజిక తనిఖీలో భాగంగా రబీ 2023-24 సీజన్‌కు సంబంధించి ఈ క్రాప్ ముసాయిదా జాబితా 1 మార్చి 2024 తేదీ నుంచి 3 మార్చి 2024 వరకు సామాజిక తనిఖీ కోసం ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. కాబట్టి గ్రామసభలు కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ గ్రామసభలలో ఆర్బికే సిబ్బంది జాబితాలో ఉన్న రైతుల పేర్లు చదివి వినిపిస్తారన్నారు. రైతులు మీ రైతు భరోసా కేంద్ర పరిధిలో ఉన్న సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించిన జాబితాను పరిశీలించి అభ్యంతరాలు ఏమైనా ఉన్నట్లయితే సవరణ కోసం మీ రైతు భరోసా కేంద్రంలో ఉన్న సిబ్బందికి రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. తరువాత ఆర్బికే అధికారి అభ్యంతరాలు పరిశీలించి ధ్రువీకరించుకుని తహశీల్దారు ఆమోదానికి లోబడి ఆర్బికేల వారిగా ఈ నెల ఐదో తేదీ లోపల తుది జాబితాలో చేర్చుతామన్నారు. తరువాత ఎటువంటి సవరణలు చేయడం కుదరదని మండల వ్యవసాయ అధికారి ఎస్కే మహమ్మద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా రైతు భరోసా కేంద్ర పరిధిలోని రైతులు పాల్గొన్నారు.



వధువును ఆశీర్వదిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, నందిని

వివాహ వేడుకల్లో బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి

స్థానిక పట్టణంలోని పుచ్చలమిట్టలో ఉపాధ్యాయురాలు నుసుం రాజ్యలక్ష్మి కుమార్తె లక్ష్మీదుర్గ వివాహ వేడుకల్లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కోడలు నందిని పాల్గొని వధువును ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



నూతన వధువును ఆశీర్వదిస్తున్న ఉగ్ర

నూతన వధువుకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-వెలిగండ్ల

మండలంలోని మోటుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ముక్కు వెంకటనారాయణరెడ్డి కుమార్తె వివాహ కార్యక్రమంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు ముక్కు పెద్దిరెడ్డి, చిలకల వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు హాజరయ్యారు. నూతన వధువును ఆశ్వీదించారు.

మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో నివసిస్తున్న గుంటి వెంగమ్మ(65) మృతి చెందడంతో విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న యర్రగొండపాలెం నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ అందుబాటులో లేని కారణంగా ఆమె మట్టి ఖర్చుల నిమిత్తం ఐదు వేల రూపాయలను మాజీ ఎంపిటిసి మెడబలిమి రాజశేఖర్ ద్వారా ఆమె కుటుంబానికి అందజేశారు.



ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి-సంతనూతలపాడు: సంతనూతలపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బిఎన్ విజయ్ కుమార్ ఆదేశానుసారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు ఆధ్వర్యంలో మండలంలోని గంగవరం, చంద్రపాలెం గ్రామాల్లో శనివారం రాత్రి బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం పార్టీ మండల కార్యవర్గ సభ్యులు రావుల సుబ్బారావు సమక్షంలో జరిగింది. కార్యక్రమంలో టీడీపీ మండల సెక్రెటరీ టీ నరసింహారావు, నాయకులు పాతూరి హరిబాబు, అశోక్‌బాబు, మొలకలపల్లి శ్రీనివాసరావు, వెంకటరామయ్య, పున్నారావు, నల్లూరి గోపి తదితరులు పాల్గొన్నారు.

నిర్మల కాన్వెంట్‌లో ఫేర్‌వెల్ వేడుకలు

ప్రజాశక్తి-పొదిలి: స్థానిక నిర్మల కాన్వెంట్ హైస్కూల్‌లో శనివారం పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు ఫేర్‌వెల్ వేడుక ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ రూబీ, సిస్టర్ రాణిలు 10వ తరగతి విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు ఎం సుధీర్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నిరంతర బదిలీలు పాలనకు ఆటంకం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

తహశీల్దారు కార్యాలయానికి బదిలీల ఫోబియా పట్టుకుంది. గత నెల రోజులుగా ప్రతి పది రోజులకు ఒక తహశీల్దారును మార్పులు చేస్తూ ఉండటంతో ఇక్కడ బాధ్యతలు చేపట్టిన వారు సైతం ఇక్కడ ఎన్ని రోజులు ఉంటారో? ఎప్పుడు బదిలీపై వెళ్తారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఫిబ్రవరి 2న తహశీల్దారుగా పనిచేసిన దూళి పూడి వెంకటేశ్వరరావు భట్టిప్రోలు నుండి బదిలీపై ఇంకొల్లుకు వెళ్లారు. ఆయన స్థానంలో 5న నెల్లూరు జిల్లా కనిగిరి చెందిన సుభద్ర తహశీల్దారుగా బాధ్యతలు చేపట్టారు. ఆమె పట్టుమని నాలుగు రోజులు కూడా పనిచేయకుండానే 9న బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో నెల్లూరు జిల్లా ఉదయగిరికి చెందిన సిహెచ్ పద్మావతి ఫిబ్రవరి 11న తహశీల్దారుగా బాధ్యతలు చేపట్టారు. ఆమె కూడా 20రోజులు పూర్తికాకముందే రేపల్లె ఆర్డీఓ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఇది ఇలా ఉండగా గత కొన్నేళ్లుగా భట్టిప్రోల్లో డిప్యూటీ తహశీల్దారు సీటు ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేస్తున్న నాగరాజు బాపట్ల కలెక్టర్ సీసీగా డిప్యూటేషన్‌పై వెళ్లటంతో ఇప్పటివరకు ఆ సీటు ఖాళీగా ఉండటంతో జిల్లా కార్యాలయం నుండి శ్రీనివాసరావును గత వారం రోజుల క్రితం డిప్యూటీ తాసిల్దారుగా నియమించారు. ఆయన కూడా మూడు రోజుల క్రితం బదిలీపై తిరిగి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లగా అక్కడ పనిచేస్తున్న మరొక శ్రీనివాసరావును డిప్యూటీ తహశీల్దారుగా రెండు రోజుల క్రితం బాధ్యతలు చేపట్టారు. దీంతో ఎన్నికల సమయంలో ఇలాంటి మార్పులు, చేర్పులతో అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అంతేకాక సుమారు నాలుగేళ్లుగా రెండు ఆర్ఐ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఇటీవల ఒక ఆర్ఐ పోస్టును భర్తీ చేయగా ఆమె కూడా డిప్యూటేషన్‌పై జిల్లా కార్యాలయానికి వెళ్లారు. దీంతో ప్రస్తుతం తహశీల్దారు కార్యాలయంలో రెండు ఆర్ఐ పోస్టులు ఖాళీ అయ్యాయి. ఇప్పటి వరకు సీనియర్లుగా ఉన్న వీఆర్‌ఓలకు ఆర్ఐ బాధ్యతలు అప్పగించి ఉన్నతాధికారులు కాలయాపన చేస్తున్నారు. ప్రస్తుతం ఈ విధానం కూడా లేకపోవడంతో కార్యాలయంలో పనిచేసే మిగిలిన అధికారులకు పని భారం పెరిగింది. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎప్పటికప్పుడు అధికారులను బదిలీలు చేస్తూ ఉంటే ఇక్కడ పరిస్థితులను అవగాహన చేసుకుని సమర్థవంతంగా పనులు నిర్వహించటం అసాధ్యంగా మారుతుందని వాపోతున్నారు.


భట్టిప్రోలు తహశీల్దారు కార్యాలయం

ఈవీఎం మిషన్ల బాధ్యత భట్టిప్రోలు అధికారులపైనే

వేమూరు నియోజకవర్గం స్థాయిలో ఎన్నికలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈవీఎం మిషన్ల బాధ్యత భట్టిప్రోలు అధికారులపైనే ఉండటంతో రెవెన్యూ అధికారులపై పని భారం మరింత పెరిగింది. నియోజకవర్గ హెడ్ క్వార్టర్లో ఉండవలసిన ఇవిఎం మెషిన్లు అక్కడ సరైన వసతులు లేవనే కారణంతో భట్టిప్రోలులోని విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల్లో ఏర్పాటు చేశారు. ఈ మిషన్ల పర్యవేక్షణ బాధ్యత ఎప్పటికప్పుడు స్థానిక తహశీల్దారుపైనే ఉంటుంది. ఇలాంటి తరుణంలో ఎప్పటికప్పుడు వీటిని పర్యవేక్షించుకుని పూర్తిస్థాయిలో అవగాహన కలిగించుకునేలోగా అధికారులను బదిలీ చేస్తున్నడంతో మించిన భారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బదిలీపై వచ్చిన తహశీల్దార్లు డిజిటల్ సంతకం కూడా యాక్టివేట్ కావడానికి వారం రోజులు పడుతుందని, అప్పటివరకు ఎలాంటి ముఖ్యమైన కార్యకలాపాలు కొనసాగించేందుకు వీలు లేకుండా పోతుందని తెలిపారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానుండటంతో అధికారులకు బదిలీల ఫోబియా పట్టుకుందని అనటంలో అతిశయోక్తి లేదు. ప్రస్తుతం బాధ్యతలు చేపట్టిన మునిలక్ష్మి ఎన్ని రోజులు ఉంటారనేది ప్రశ్నార్థకంగా మారింది.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - అద్దంకి


రామమోహన్‌రావు

మహా శివరాత్రి సందర్భంగా అద్దంకి చుట్టు ప్రక్కల ప్రాంతాల భక్తులు, ప్రజల కోసం ఆర్టీసీ డిపో నుండి 30 ప్రత్యేక బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు డిపో మేనేజర్ రామ్మోహనరావు తెలిపారు. ఆయన విలేకరులతో శనివారం మాట్లాడారు. గత ఏడాది మాదిరిగానే సాధారణ చార్జీలు రూ.105 ఉంటుందని అన్నారు. నిర్దేశించిన సమయాల్లో బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. అద్దంకి పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు.


నూతన తహశీల్దారును స్వాగతిస్తున్న సిబ్బంది

భట్టిప్రోలు తహశీల్దారుగా మునిలక్ష్మి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

నూతన తహశీల్దారుగా ఐ మునిలక్ష్మి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన పద్మావతి రేపల్లె ఆర్డీఓ కార్యాలయానికి సీసీగా బదిలీ అయ్యారు. పిట్టలవానిపాలెం తహశీల్దారుగా పనిచేస్తున్న మునిలక్ష్మి బదిలీపై వచ్చారు. తిరుపతి జిల్లా నుండి ఫిబ్రవరి 5న ఎన్నికల బదిలీల్లో భాగంగా పిట్టలవానిపాలెంలో బాధ్యతలు చేపట్టిన ఆమె నెల రోజులు కూడా పూర్తికాకముందే భట్టిప్రోలుకు బదిలీ కావటం తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. డిప్యూటీ తహశీల్దారుగా శ్రీనివాసరావు బాపట్ల కలెక్టర్ కార్యాలయం నుండి బదిలీపై వచ్చి గురువారం బాధ్యతలు చేపట్టారు. నూతన తహశీల్దారు మునిలక్ష్మిని సిబ్బంది స్వాగత సత్కారం చేశారు. అనంతరం సిబ్బంది, వీఆర్వోలు, సర్వేయర్లతో ఆమె సమీక్ష నిర్వహించారు. మండల స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ తనకు సహకరించి ఎన్నికలు సజావుగా జరిగే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాసరావు, సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వోలు శివరామకృష్ణ, అంబటి ప్రసాద్, వినీత, రత్నాకర్, గ్రేసమ్మ, కంప్యూటర్ ఆపరేటర్లు దరియా, రాజేష్ పాల్గొన్నారు.


ఉద్యోగ బాధ్యతల్లోకి పశుసంవర్ధక శాఖ ఉద్యోగులు

బాధ్యతలు స్వీకరించిన పశు సంవర్ధక శాఖ ఉద్యోగులు

ప్రజాశక్తి - పంగులూరు

గ్రామ సచివాలయ పరిధిలో ఉండే పశువైద్యశాలలో యానిమల్ హస్బెండ్ ఉద్యోగులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వ చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో ఎంపికైన అభ్యర్థులు శనివారం తమ కేటాయించిన సచివాలయాల్లో చేరారు. స్థానిక ఎంపిడిఓ కె మ్యాత్యూ బాబుకు తమ నియామక పత్రాలను అందజేసి విధుల్లో చేరారు. మండలంలో 14సచివాలయాలు ఉండగా ఇప్పటివరకు మూడు సచివాలయంలో మాత్రమే పశు సంవర్ధక శాఖ ఉద్యోగులు ఉన్నారు. మిగతా 11చోట్ల కొత్త ఉద్యోగులు వచ్చారు. ప్రస్తుతం పంగులూరు-1కు పి రమేష్, బూదవాడకు షేక్ అర్షియా, రామకూరుకు డి ప్రమీల భాయ్, కొండ మంజులూరుకు వై యశోద, తూర్పు తక్కెలపాడుకు టి వెంకట జ్ఞానేశ్వరి, ముప్పవరంకు కె మహాలక్ష్మి విధుల్లో చేరగా మరో ఐదుగురు కూడా విధుల్లో చేరాల్సి ఉంది. వీరు రైతు భరోసా కేంద్రాల అసిస్టెంట్లుగా ఉంటారని ఎంపీడీఓ తెలిపారు. రైతులు, పశుపోషకులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు.

రైతు సంక్షేమమే సిఎం ధ్యేయం

ప్రజాశక్తి - రేపల్లె


నూతన భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపి మోపిదేవి

రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రైతు పక్షపాతిగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో రూ.కోటి వ్యయంతో నూతనంగా నిర్మించనున్న పరిపాలన భవనానికి ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈపాటికే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన వ్యవసాయ అనుబంధ పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయంలో వస్తున్న ఆధునిక మార్పులను గ్రామీణ ప్రాంత రైతులకు వివరించి అధిక దిగుబడులు సాధించేందుకు ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాల్లోని నిపుణులైన వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు అందిస్తున్నారని చెప్పారు. వ్యవసాయంలో మెళకువలను చెప్పి లాభదాయకమైన వ్యవసాయ పద్ధతులు వివరిస్తున్నట్లు తెలిపారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతు బాంధవుడుగా పేరు పొందారని అన్నారు. రైతులు బాగుంటే ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందనే ఆశయంతో రైతుల అవసరాలకు అనుగుణంగా ఆర్‌బికెలు, గిడ్డంగుల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే మార్కెట్ యార్డులో అన్ని సౌకర్యాలతో గిడ్డంగులను పునర్నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు గడ్డం రాధాకృష్ణమూర్తి, ఎఎంసి ఛైర్మన్ దేవగిరి సాంబయ్య పాల్గొన్నారు.


విరాళం అందిస్తున్న సజ్జా వెంకటేశ్వర్లు

అన్నా క్యాంటీన్‌కు సజ్జా విరాళం

ప్రజాశక్తి - చీరాల

మంగళగిరిలో అన్నా క్యాంటీన్ నిర్వహణకు చీరాల టిడిపి సీనియర్ నాయకులు సజ్జా వెంకటేశ్వరరావు విరాళం అందించారు. 100రోజుల పాటు క్యాంటీన్ నిర్వహణకు రోజుకు రు.10వేల చొప్పున రు.10లక్షల విరాళాన్ని క్యాంటీన్ నిర్వాహకులు అబద్దయ్యకు అందజేశారు. టిడిపి అధినేత చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్న క్యాంటీన్ల నిర్వహణతో పేదల ఆకలి తీరుస్తుందని అన్నారు. టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ స్ఫూర్తితో పేదల ఆకలి తీర్చేందుకు చేపట్టిన అన్న క్యాంటీన్ల నిర్వహణ అభినందనీయమని అన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారానికి వచ్చిన తరువాత ప్రభుత్వం ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్లు యధావిధిగా కొనసాగుతాయని అన్నారు. అప్పటి వరకు టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన అన్న క్యాంటీన్ నిర్వహణకు తన వంతు సహకారం అందించినట్లు తెలిపారు. గుత్తి శివయ్య, బాలు, సజ్జా రవికుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - రేపల్లె


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఎపిఎం

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఎపిఎం త్యాగరాజు అన్నారు. స్థానిక వెలుగు ప్రాజెక్ట్ కార్యాలయంలో డ్వాక్రా సంఘాలతో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. రసాయనాలతో పండించిన పంటలు తినడం వల్ల వ్యాధులు కొని తెచ్చుకుంటున్నారని అన్నారు. రసాయనాలు వాడి పండించిన పంటను తినడం వల్ల జీవన విధానంలో అనేక రోగాల బారిన పడవలసి వస్తుందని అన్నారు. పకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న పంటలకు అతివృష్టి, అనావృష్టిని తట్టుకోవడమే కాకుండా భూమిలో జీవరాశిని, జీవవైవిధ్యాన్ని పెంపొందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. వీటిని తినడం ద్వారా ఆరోగ్య సమస్యలు రాకుండా ఉంటాయని తెలిపారు. వచ్చిన సమస్యలను అధిగమించవచ్చని అన్నారు. ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారి వినయ్ కుమార్ మాట్లాడుతూ ఇంతకు ముందు రైతు సంఘాల ద్వారా జరిగిన ప్రకృతి వ్యవసాయం మహిళ సాధికార సంస్థల ద్వారా మరింతగా విస్తరించేందుకు ప్రతి గ్రామంలో ప్రతి మహిళ ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటించాలని కోరారు. ప్రతి నెల వెలుగు ఆఫీస్ దగ్గర పంటల చీడ పీడలకు కషాయాల తయారీ, మొక్కల పెరుగుదలకు పూత, పిందె, మొక్కలు ఆరోగ్యంగా పెరగడానికి గ్రోత్ ప్రమోటర్స్ తయారీ విధానాలను ప్రత్యక్షంగా తయారు చేసి అందరికీ అవగాహన కలిగించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిసిలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, రమేష్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి కమిటీ ఎంపిక

ప్రజాశక్తి - పంగులూరు


ఎంపీడీఓ మ్యాత్యూబాబు

కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి కమిటీ ఏర్పడినట్లు ఎంపీడీఓ కె మ్యాత్యూ బాబు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల స్థాయిలో ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పడిందని తెలిపారు. ఎంపీడీఓ టీం లీడరుగా ఒక కానిస్టేబుల్, ఒక ఫోటోగ్రాఫర్ సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఎన్నికల షెడ్యూలు రావడంతోనే ఈ కమిటీ పని అమల్లోకి వస్తుందని తెలిపారు.

4 పొగాకు బేళ్లు తిరస్కరణ

ప్రజాశక్తి - కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రంలో శనివారం జువ్విగుంట గ్రామానికి చెందిన పొగాకు రైతులు 79బేళ్లను అమ్మకానికి రాగా 75బేళ్లు కొనుగోలు చేయగా మిగిలిన 4బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించినట్లు వేలం నిర్వహణాధికారి జి సునీల్‌కుమార్ తెలిపారు. అత్యధిక ధర కిలో రూ.230, అత్యల్ప ధర కిలో రూ.230, సరాసరి ధర కిలో రూ.230 పలికిందన్నారు. వేలం కేంద్రంలో 15 కంపెనీలు పాల్గొన్నారు.

6న ఐటిఐ కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ఈనెల 6న గూడవల్లి త్రిపురనేని రామస్వామి చౌదరి ఐటిఐ కళాశాల్లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రావి శ్యామ్ ప్రసాద్ శనివారం తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, ఎంబీఎ, ఎంసీఎ ,ఎంఎస్సి, ఏదైనా పీజీ, ఐటిఐ, డిప్లమో, బీఫార్మసీ చేసిన అభ్యర్థులు తమ వివరాలుతో హాజరు కావాలని కోరారు. కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్, ఎన్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్, హెటెరో డ్రగ్స్, ఆదిత్య బిర్లా క్యాపిటల్, వెల్ జాన్ డేనీ సన్ లిమిటెడ్, ప్రిన్స్‌టన్ సాఫ్ట్వేర్ తదితర కంపెనీలు జాబ్ మేళా నిర్వహించి అర్హులైన వారికి ఉద్యోగాలు కల్పిస్తారని తెలిపారు.

ప్రజాశక్తి

ఆదివారం 3 మార్చి 2024

టిడిపితోనే రాష్ట్రానికి భవిష్యత్తు

టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

భవితరాల భవిష్యత్తుకు టిడిపి అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం అవశ్యమని, ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి మద్దతు తెలపాల్సిన సమయం ఆసన్నమైందని టిడిపి బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు, ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు అన్నారు. తన క్యాంప్ కార్యాలయంలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడారు. వైసిపి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుక బాటుకు గురైందని అన్నారు. అభివృద్ధిలో పరుగులు తీయాల్సిన రాష్ట్రం అచేతన స్థితిలో ఉందని అన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో అన్ని రంగాల్లో అగ్రభాగాన ఉంటే నేడు అదమస్థితిలో ఉందన్నారు. రాష్ట్రం అభివృద్ధిలోకి రావాలంటే విజనరీ నేత చంద్రబాబుతోనే సాధ్యమని అన్నారు. గత ఐదేళ్లుగా అరాచకం, విధ్వంసం, దోపిడీ తప్ప అభివృద్ధి లేదన్నారు. బిడ్డల భవిష్యత్తు బాగుండాలంటే టిడిపితో కలిసి రావాలని కోరారు.

జగన్ పాత్రపై విచారణ జరపాలి

మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్‌రెడ్డి పాత్రపై విచారణ జరపాలని ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధికోసం వైఎస్ వివేకానందరెడ్డిని హతమార్చిన హంతక ముఠాను



చిన్నగంజాం కార్యకర్తలతో ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

జగన్ మోహన్ రెడ్డి కాపాడుతున్నారని ఆరోపించారు. సీబీఐ విచారణ పిటిషన్ వేస్తానని సోదరి సునీత అంటే జగన్ ఎందుకు ఆపారో సమాధానం చెప్పాలన్నారు. మొదట సీబీఐ విచారణ కోరిన జగన్‌రెడ్డి తరువాత వద్దు అనడం వెనుక కారణాన్ని ప్రజలకు వివరించాలని అన్నారు. సీఎం అయిన తరువాత జగన్‌రెడ్డి సీబీఐ విచారణ పిటిషన్‌ను ఎందుకు వెనక్కి తీసుకున్నారని, బాబాయిని చంపిన అబ్బాయిని జగన్‌రెడ్డి రక్షించడం వెనుక ఆంతర్యం ఏమిటిని ప్రశ్నించారు. తన తండ్రికి న్యాయం చేయాలని కూతురు పోరాడుతుంటే తమ్ముడిని సీబీఐ అరెస్టు చేయకుండా జగన్ అడ్డుపడ్డారని అన్నారు. జగన్‌రెడ్డి ఇప్పటికైనా ప్యాలెస్ నుంచి బయటకు వచ్చి వివేకానందరెడ్డిని చంపిన నిజం ఒప్పుకోవాలని కోరారు. ముఖ్యమంత్రిగా కొనసాగేందుకు జగన్‌కు కనీస అర్హత లేదని అన్నారు. సోదరికి న్యాయం చేయలేని సీఎం రాష్ట్రంలోని మహిళలకు ఏ విధంగా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. వివేకాను చంపిన వారిని వదిలిపెడితే మంచికి, చెడుకు అర్థం లేకుండా పోతుందన్నారు. జరగబోయేది పేదలు, పెత్తందార్లకు మధ్య యుద్ధం కాదని, హంతకులకు, రాష్ట్ర ప్రజలకు మధ్య యుద్ధమని అన్నారు. జగన్ సోదరి సునీత చేస్తున్న న్యాయపోరాటంలో ఆమెకు టీడీపీ అండగా ఉంటుందని అన్నారు. వివేకానందరెడ్డిని క్రూరంగా గొడ్డలితో నరికి చంపిన నరహంతకులకు శిక్ష పడకపోతే రేపు పౌరుని మాన, ప్రాణాలకు రక్షణ ఉండదని అన్నారు.

టిడిపిలోకి ఊపందుకున్న వలసల పర్వం

పర్చూరు నియోజకవర్గంలో పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో టిడిపి కండువ కప్పుకున్నారు. చిన్నగంజాం మండలం పెద్దగంజాం పల్లెపాలెంకు చెందిన 30మంది యువకులు టిడిపి నాయకులు ఆసోది సుబ్బారెడ్డి, గొల్లపోతు వెంకటేశ్వర్లు, దండుప్రోలు తిరుపతిరావు ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. కట్టావారిపాలెంకు చెందిన యువకులు, ఇంకొల్లు మండలం నాగండ్లకు చెందిన యువకులు, మార్టూరుకు నేతాజీ నగర్‌కు చెందిన నాగండ్ల తిరుమల, అద్దేటి అనిల్ ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే ఏలూరి కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు.



వైద్యశిబిరం ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున

ఉప్పుగుండూరులో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

మండలంలోని ఉప్పుగుండూరు పంచాయితీ ఆవరణలో స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా సంస్థల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. స్ఫూర్తి స్వచ్ఛంద సేవాసంస్థ అధినేత బివి రావు, ఎంపిపి చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, ఉపసర్పంచ్ పెంట్యాల శ్రీనివాస రావు, పి శ్రీమన్నారాయణ, మాదాసు రాంబాబు, సొసైటి చైర్మన్ ఉప్పుగుండూరి శ్రీనివాసప్రసాదు, రాష్ట్రడైరెక్టరు కొలకలూరి విజయకుమార్, వేణుగోపాలస్వామి దేవస్థానం చైర్మన్ పెంట్యాల జ్యోతి శ్రీనివాసరావు, కొంజేటి వెంకట సురేష్ బాబు, ప్రవీణ్, కె సుదాకర్, వజ్రంబాబు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న బలరామకృష్ణమూర్తి

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - వేటపాలెం

అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని తాజా మాజీ ఎంఎల్ఎ కరణం బలరామకృష్ణమూర్తి అధికారులను ఆదేశించారు. మండలంలోని దేశాయిపేట, జాండ్రపేట, రామకృష్ణాపురం పంచాయతీల పరిధిలో అభివృద్ధి పనులను ఆయన శనివారం పరిశీలించారు. పూర్తి చేసిన దేశపేట సచివాలయం పరిశీలించి సూచనలు చేశారు. జాండ్రపేట, రామకృష్ణాపురం పంచాయతీల్లో స్థానిక నాయకులతో మాట్లాడి సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయితీ రాజ్ డిఈ శేషయ్య, వైసిపి మండల అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, జెసిఎస్ మండల ఇంచార్జీ లేళ్ల శ్రీధర్ పాల్గొన్నారు.

నేడు పల్స్ పోలియో

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని డాక్టర్ చినభానుప్రకాశరావు కోరారు. 5ఏళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పని సరిగా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి టి అంజలి, సిహెచ్ఓ కోటేశ్వరరావు, పిహెచ్ఎన్ సహస్ర, సూపర్‌వైజర్లు మౌని, ప్రభావతి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశాలు, విద్యార్థులు పాల్గొన్నారు. పూసపాడు, నాగండ్ల, ఇడుపులపాడు, వంకాయలపాడు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు.

పొన్నలూరు : మండలంలోని 15 సచివాలయాల్లో నేడు పోలియో చుక్కలు వేయడానికి ఏర్పాట్లు పూర్తయినట్లు వైద్యాధికారి డాక్టర్ చైతన్య శనివారం తెలిపారు. 33 బూతుల్లో 3108 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయటానికి ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు.

శింగరాయకొండ : స్థానిక పిహెచ్‌సి ద్వారా ఆర్టీసీ బస్టాండ్ నుంచి కందుకూరు రోడ్డు కూడలి వరకు డాక్టర్ చైతన్య కృష్ణ ఆధ్వర్యంలో పల్స్‌పోలియో అవగాహన ర్యాలీ శనివారం శ్రీ వివేకానంద హైస్కూల్ విద్యార్థులచే నిర్వహించారు. డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ఆదివారం జరిగే పల్స్ పోలియోలో 4,639 మంది 5ఏళ్ల పిల్లలను టార్గెట్గా చేసుకొని మండలంలో 3రూట్‌లను విభజించి 37బూతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైల్వేస్టేషన్, బస్టాండ్ నందు మొబైల్ టీం ద్వారా పోలియో చుక్కల వేస్తామని తెలిపారు. సయ్యద్ మసూద్‌అలీ, డివికె సాంబశివరావు, కె రాజమ్మ, సంపూర్ణమ్మ, టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

దివ్యాంగుల సంక్షేమం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆ సంఘ గౌరవ అధ్యక్షులు మహమ్మద్ బాషా అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో వికలాంగుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. మహ్మద్ బాషా మాట్లాడుతూ జన్యుపరమైన కారణాల వల్ల అంగవైకల్యం తో ఉన్న వారి సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందని అన్నారు. వికలాంగులను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్ప వారి సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. దివ్యాంగులకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అధికారం లోకి వచ్చేవాళ్ళు హామీలు తప్ప పరిష్కారం వైపు చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. దివ్యాంగులకు అవసరమైన పరికరాలు, యంత్రాలు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులకు నివేశస్థలాలు ఇవ్వాలని అన్నారు. పెరిగిన ధరలకు కనుగుణంగా వికలాంగుల పెన్షన్ రూ.6వేలకు పెంచాలని కోరారు. గృహ నిర్మాణం కోసం ప్రభుత్వం ఇచ్చే నిధులు రూ.5లక్షలకు పెంచాలని అన్నారు. గృహాలకు 300యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఏడాదికి 6 వంటగ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని తీర్మానించారు.



దివ్యాంగుల సమావేశంలో మహ్మద్ బాషా

నూతన కమిటీ ఎంపిక

వికలాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులుగా మహమ్మద్ బాషా, సాయి, నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా రాజుగారిపాలెం, మార్టూరు గ్రామాలకు చెందిన ఉప్పలపాటి అచ్చుత రామరాజు, గద్దం జాన్, కోశాధికారిగా ఆవుల రత్తయ్య, సభ్యులుగా మీరావలి, కోట వెంకట సుబ్బారావు, కొమెర శ్రీనివాసరావు, వేళ్ళ వసుంధర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జల్లి కోటేశ్వర రావు, మండలంలోని వికలాంగులు పాల్గొన్నారు.



అంగన్‌వాడి సూపర్వైజర్ ఇందిర

బాలికలు ధైర్యంగా ఉండాలి

ప్రజాశక్తి - మేదరమెట్ల

కొరిశపాడులోని డిఆర్‌కె ఉన్నత పాఠశాల్లో కిశోర్ బాలల పథకంలో భాగంగా బాల్యవివాహాల నిరోధక చట్టం, బాలల హక్కులను కాపాడుకోవడం, జీవన విధానం, నవ సమాజంలో బాలికలు ధైర్యంగా ఉండాలనే అంశాలను ఐసిడిఎస్ సూపర్వైజర్ కె ఇందిర వివరించారు. కార్యక్రమంలో ఆమెతో పాటు అంగన్‌వాడి కార్యకర్తలు, ఆయాలు, పాఠశాల్లోని 9, 10తరగతుల విద్యార్థినిలు పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - టంగుటూరు

ఓటు హక్కు వినియోగంతో జరిగే పర్యవసానాలపై ఒంగోలులో విస్తృత చర్చ ఆదివారం జరగనుందని దళిత ఐక్యవేదిక అధ్యక్షులు వెంగళరావు పేర్కొన్నారు. ఆత్మీయ సమ్మేళనం సన్నాహక సమావేశం, పోస్టర్ల ఆవిష్కరణ శనివారం చేశారు. నేడు సాయంత్రం 3 గంటలకు ఒంగోలు అంబేద్కర్ భవన్‌లో జరిగే ఆత్మీయ సమ్మేళనంకు జిల్లా నలుమూలల నుండి దళిత సోదరులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో దళిత ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బాబు, తుల్లిబిల్లి అశోక్ బాబు, సత్యం, క్రాంతి, రాజు, తిరుమలరావు, కార్తీక్ పాల్గొన్నారు.

ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - రేపల్లె

ఎన్నికల విధులు అధికారులు నిజాయితీగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆర్‌డిఓ హేలా షారోన్ అన్నారు. తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ఎన్నికల వ్యయ వివరాల నమోదు ఒక అంశమైతే, నోటిఫికేషన్ నుంచి కౌంటింగ్ ముగిసే వరకు ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణ మరోఎత్తుగా ఉంటుందని అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో జరిగే రాజకీయ సభలు, ర్యాలీలను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. తక్కువ ఓట్లు పోలయ్యే ప్రాంతాల్లో ఓటు వినియోగంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్య పర్చాలని అన్నారు. 80ఏళ్ల దాటిన వృద్ధులు ఇంటి వద్ద నుంచే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం ఉందని వారికి చెప్పాలని అన్నారు. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని, యువత, ప్రజలు సివిజిల్ యాప్లో అప్లోడ్ చేస్తే బాధ్యులపై ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంపై అధికారులు పట్టుకలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో ఆర్‌డిఓ హేలా షారోన్

రూ.20 లక్షలతో సిసి రోడ్లు

ప్రజాశక్తి - కొండపి

స్థానిక గురుకుల పాఠశాలలో రూ.20లక్షల నిధులతో సిసి రోడ్లు వేస్తున్నారని పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్ అరుణ తెలిపారు. వర్షకాలంలో విద్యార్థుల ఇబ్బందులను జడ్‌పి చైర్మన్‌కి విన్నవించడంతో వెంటనే నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల కష్టాలు తీరుతాయని అన్నారు. సిసి రోడ్డుకి నిధులు మంజూరు చేసి జడ్‌పి చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

హత్యాయత్నం కేసు నమోదు

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక ఇందిరా కాలనీలో చోటు చేసుకున్న దాడి సంఘటనపై హత్యా ప్రయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. కాలనీకి చెందిన నల్లబోతుల గణేష్‌పై మల్ల యేసురాజు మరో ఆరుగురు కలిసి దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారని వివరించారు. ఏరియా వైద్యశాల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఘటనలో పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉంది.

మద్దిపాడు ఎంపిడిఓగా శ్రీహరి

ప్రజాశక్తి - మద్దిపాడు

నూతన ఎంపిడిఓగా శ్రీహరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన సుగుణమ్మ కొనకనమెట్లకు బదిలీ అయ్యారు. శ్రీహరికి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరి: ఎస్‌పి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు రోడ్డు ప్రమాదాల నుండి రక్షణకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ జిల్లా ప్రజలకు సూచించారు. శనివారం జిల్లా ఎస్పీ ఆదేశాలతో నోయాక్సిడెంట్ డేలో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారికి, వాహన చోదకులకు, ప్రయాణికులకు రహదారి భద్రత నియమాల గురించి, హెల్మెట్ యొక్క ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలలో ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారే మత్యువాత పడుతున్నారన్నారు. దీనికి ప్రధాన కారణం ద్విచక్ర వాహనంపై ప్రయాణించేవారు హెల్మెట్ ధరించకపోవడమేనన్నారు. రోడ్డు ప్రమాదాలు ఒక్కరినే బలిగొనవని, మొత్తం కుటుంబాన్నే విచ్ఛిన్నం చేస్తాయన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితులను నిత్యం కళ్లముందు చూస్తూనే ఉంటున్నామన్నారు. పోలీసులు విధించే జరిమానాలు, కేసులకు భయపడి చాలా మంది హెల్మెట్‌ను కొంటున్నా, వాటిని వినియోగించడంలో శ్రద్ధ చూపడం లేదన్నారు. చిన్నపాటి దూరమైనప్పటికీ ప్రయాణ సమయంలో ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు.



సభ్యత్వ నమోదులో పాల్గొన్న రమాదేవి

ఐద్వా సభ్యత్వ నమోదు ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం (ఐద్వా) సభ్యత్వ నమోదు క్యాంపెయిన్‌ను ఒంగోలులోని సత్యనారాయణపురంలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐద్వా మహిళా సంఘానికి దేశవ్యాప్తంగా కోటి 30లక్షల మంది సభ్యులుగా ఉన్నారని తెలిపారు. మహిళల సమస్యల మీద ఐద్వా నిరంతరం పోరాడుతోందని, మహిళల హక్కుల కోసం, మహిళపై జరుగుతున్న అఘాయిత్యాలకు వ్యతిరేకంగా , స్త్రీ, పురుష సమానత్వం కోసం అనేక పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, ఒంగోలు నగర కార్యదర్శి జి ఆదిలక్ష్మి, నాయకులు కె రాజేశ్వరి, బి గోవిందమ్మ, ఎస్ ఇంద్రజ్యోతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్

కలసికట్టుగా పనిచేయండి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర భవిష్యత్తు, ఒంగోలు అభివృద్ధి కోసం వచ్చే 45 రోజులు టిడిపి నాయకులు, కార్యకర్తలు కలసి కట్టుగా పనిచేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు సూచించారు. ఒంగోలు నగరంలోని టిడిపి కార్యాలయంలో దామచర్ల జనార్ధనరావు అధ్యక్షతన క్లస్టర్ , యూనిట్, బూత్ ఇంచార్జి లతో ఒంగోలు నియోజకవర్గ విస్తత స్థాయి సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా జనార్ధనరావు వచ్చే 45 రోజులు ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడాలని, రాష్ట్ర భవిష్యత్ కోసం ఒంగోలు అభివద్ధి కోసం మీరందరూ కలిసి పనిచేయాలన్నారు. ప్రతి ఒక్క బూత్ ఇన్‌చార్జి బూత్ పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి బాబు వస్తే చేయబోవు సంక్షేమ పథకాలు సూపర్ సిక్స్‌పై ప్రజలందరకి వివరించి వారికి క్యాలెండర్లు అందజేయాలన్నారు. సమావేశంలో కామేపల్లి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరావు, బండారు మదన్, పి వెంకటేశ్వరెడ్డ్, జంపాని రామచంద్ర గౌడ్ పాల్గొన్నారు.

సిఎం బహిరంగ సభకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, మంత్రి సురేష్

ఈనెల 6వ తేదీన ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటన ఖరారు కావడంతో శనివారం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, యర్ర గొండపాలెం పట్టణం మాచర్ల రోడ్డులోని లలితా నగర్ ఖాళీ స్థలాలను పరిశీలించారు. బహిరంగ సభకు ఆ స్థలాన్ని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఏఎస్పీ నాగేశ్వరరావు, వైపాలెం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్‌తో కలిసి చర్చించారు. సభా వేదికను ఎటువైపున ఏర్పాటు చేయాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర జాగ్రత్తలను అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే వినుకొండ రోడ్డులో గల వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో ఈపాటికే ఉన్న హెలీప్యాడ్‌ను పరిశీలించారు. మార్కెట్ యార్డుకు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని కూడా పరిశీలించారు. అక్కడ కూడా అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పీవో డాక్టర్ బి రవీంద్రారెడ్డి, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఎస్పీ బాల సుందరరావు, డిఎల్‌డివో బివిఎన్ సాయికుమార్, యర్రొగండపాలెం, కంభం సిఐలు రాములు నాయక్, రామ కోటయ్య, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఇరిగేషన్ డైరెక్టర్ వెంకటరెడ్డి, ఎంపిపిలు దొంతా కిరణ్ గౌడ్, కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్, సర్పంచ్ రామావత్ అరుణాబాయి, వైసీపీ మండల కన్వీనర్లు కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, సింగారెడ్డి పోలిరెడ్డి, డిప్యూటీ తహశీల్దారు విజయభాస్కర్, మండల సర్వేయర్ సైదారావు, ఎంపిడివో వైవీ నాగేశ్వర ప్రసాద్, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీ లక్ష్మిరెడ్డి, రెవెన్యూ, పోలీస్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల శంఖారావం పూరించాలి..

టిడిపి నాయకులకు ఎమ్మెల్యే స్వామి దిశానిర్దేశం

ప్రజాశక్తి-టంగుటూరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

రానున్న 40 రోజులు మనకు ఎంతో కీలకమైన సమయం అని, టిడిపి సైనికులంతా ఎన్నికల సమర శంఖారావం పూరించాలని కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య టిడిపి నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. శనివారం సాయంత్రం స్థానిక తూర్పు నాయుడుపాలెం పంచాయతీ సమీపంలోని ఐఓసీ ఎదురుగా ఉన్న దామచర్ల సత్య కంపెనీ వద్ద నియోజకవర్గ స్థాయి టిడిపి నాయకులు, కార్యకర్తల విస్తత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు శంఖారావం సభ త్వరలో మన కొండపి నియోజకవర్గంలో నిర్వహించనున్న సందర్భంగా సభ నిర్వహణపై నాయకులకు పలు సూచనలు చేశారు. శంఖారావం సభను పురస్కరించుకొని టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాలలోని ప్రతి టిడిపి కార్యకర్తను సభ విజయవంతం కోసం సన్నద్ధం చేయాలని సూచించారు. గ్రామాలలో పోలింగ్ బూత్ ల వారీగా ఓటరు జాబితా పరిశీలన, తదితర అంశాలపై నాయకులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అధికార పార్టీ రానున్న ఎన్నికలలో ఎన్ని అడ్డదారులు తొక్కినా గెలవాలన్న కుట్రలతో పని చేస్తుందని, దీనిని టిడిపి నాయకులంతా సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్య నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఎన్నికల పరిశీలకులు అడకా స్వాములు, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, టంగుటూరు మండల, పట్టణ టిడిపి అధ్యక్షులు కామని విజయకుమార్, కామని నాగ శ్రీను, మండల తెలుగు యువత అధ్యక్షులు అబ్బూరి అభిషేక్, జరుగుమల్లి, సింగరాయకొండ మండలాల టిడిపి అధ్యక్షులు పోకూరి రవీంద్రబాబు, వేల్పుల సింగయ్య, నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

ఆ భూమి దళితులకు దక్కేవరకు ఉద్యమిస్తాం

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్



మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

పెద్దచెర్లోపల్లి మండలం కోదండరామపురం, మెట్లవారి పాలెం గ్రామాల దళితుల భూములను దౌర్జన్యంగా ఆక్రమించారని, అక్రమ రిజిస్ట్రేషన్లు చేసిన వారిని తొలగించి లబ్ధిదారులకు ఆ భూములు దక్కేవరకు ఉద్యమిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. శనివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా బృందం, బాధిత దళిత రైతులు తమకు న్యాయం చేయాలని జిల్లా అధికారులను కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. అనంతరం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఈ భూ ఆక్రమణలు, అక్రమ రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన విషయాలను పత్రికలకు వెల్లడించారు. దళితుల భూములు దళితులకు దక్కేవరకు ఉద్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు, భూ హక్కు దారులు ఎర్రగుంట్ల బాలయ్య, వై నారాయణ, రాగి మాల్యాద్రి, ఎర్రగుంట్ల చిన్న బాలయ్య పాల్గొన్నారు.

వేడెక్కుతున్న రాజకీయం

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సాగుతున్న వ్యూహాలతో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. రాజకీయపార్టీల పంథాలు.. అభ్యర్థుల ప్రకటనలు.. అసమ్మతులు.. అవకాశవాదాలు.. వెన్నుపోట్లు.. ఇలా అనేక పర్వాలు పార్టీల్లో కనిపిస్తున్నాయి. ఇవన్నీ ఎన్నికల్లో సర్వసాధారణంగా కనిపించేవే.. అయితే ఈ సారి ప్రత్యేకతలేమిటంటే అభ్యర్థుల ఎంపికలోనే కొత్త వ్యూహాలు ముందుకువచ్చాయి. ఎత్తుకుపైఎత్తులు తీవ్రమయ్యాయి. సాంప్రదాయ రాజకీయనేతల రాజకీయ భవితవ్యాలూ కొందరికి తారుమారయ్యాయి. డబ్బు, సామాజిక అంశాలు అస్త్రాలుగా మారాయి. ఇవన్నీ ప్రస్తుత రాజకీయాల్లో ప్రస్ఫుటంగా కనిపించే మార్పులుగా చూడొచ్చు. ఈ వ్యూహాలన్నీ గెలుపు కోసమే కనిపిస్తున్నాయి. ప్రధానంగా వైసిపిలోనే ఈ వింతలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఎంపీ మాగుంటకు అధిష్టానం సీటు నిరాకరించింది. పొమ్మనకుండా పొగ పెట్టేసింది. ఆయన పార్టీకి రాజీనామా చేశారు. ఆయన కోసం మాజీ మంత్రి బాలినేని చివరి వరకూ ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. మాగుంటకు ఎందుకు నిరాకరించారు? ఎక్కడో చిత్తూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అనే నేతను ఇక్కడ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఎందుకు దింపుతున్నారో ఇప్పటికీ వైసిపి శ్రేణులకు అంతుచిక్కడం లేదు. రాజకీయ పంతాలా? లేక కేంద్ర పాలకుల ఒత్తిళ్ల ఫలితమా? అన్నదీ స్పష్టత లేదు. ఏదేమైనా గత ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీని వీడి వైసిపిలో చేరిన మాగుంట ఇప్పుడు మళ్లీ ఉన్న పార్టీని వీడి పాత పార్టీలో చేరాల్సి వస్తోంది. ఇదంతా జగన్నాటకంగా భావిస్తున్నారు. సిఎం జగన్ ఒంగోలులో పేదలకు ఇళ్లపట్టాల పంపిణీకి హాజరయ్యారు. ఎంపీ మాగుంటను దూరంగా పెట్టారు. తన ప్రసంగంలో బాలినేని పేరు ప్రస్తావన లేకపోవడం కూడా చర్చగా మారింది. ఇక అభ్యర్థుల ఎంపికలోనూ జాబితాలు వస్తూనే ఉన్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో చూస్తే పాలకపక్షంలో మరో సీనియర్ ఎమ్మెల్యేకూ సీటు పోయింది. బీసీలకు పెద్దపీట పేరుతో ఒక సామాజికవర్గానికి చెందిన వారికే రెండు స్థానాలు కేటాయించారు. అంటే బీసీల్లో డబ్బున్న సామాజికవర్గానికి టిక్కెట్లు ఇచ్చి మిగతా బీసీల ఓట్లు పడతాయని భావించడం ఆశగానే కనిపిస్తోంది. బీసీల్లో 99 కులాలుంటే ఎవరో ఒకరికిస్తే అందరూ ఓటేస్తారని భావించడం పప్పులో కాలేసినట్లే.. ఇప్పుడు ఎన్నికల్లో ఇదే జరుగుతోంది. ఎన్నికల కోసం, ఓట్ల కోసం పార్టీలు ఈ తంతును ముందుకు తెచ్చారు. వాస్తవానికి బీసీల్లో ఉన్న కులాల మొత్తం సమానంగా అభివృద్ధి చెందారా? అనేదీ చూడాలి. ఏమీ లేదు. గెలుపు కోసం సామాజిక అంశాన్ని ప్రధానాస్త్రంగా మార్చారు. దీంతో పాటు డబ్బు మరో అస్త్రంగా మారింది. డబ్బు లేని నేతలకు టిక్కెట్లు లేవని పార్టీలు రుజువు చేస్తున్నాయి. పాలకపక్షంలోనే ఈ తరహా తంతు ఎక్కువగా ఉంది. రూ.కోట్లు పెడతామంటేనే సీటు ఇస్తున్నారు. ప్రతిపక్షంలో అభ్యర్థులకు డబ్బు సమస్యగానే కనిపిస్తోంది. పార్టీని చాలా కాలంగా అంటిపెట్టుకున్న నేతలకు టిక్కెట్లు ఇచ్చారు. వీరిలో కొందరికి పార్టీ నుంచి పెట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. అందుకే ఇంకా మూడు నియోజవర్గాలకు అభ్యర్థులను ప్రకటించ లేదు. జనసేనకు ఒక స్థానం కేటాయించాల్సి ఉంది. దర్శి కేటాయించినట్లు ఇప్పటి వరకూ చర్చ ఉంది. అక్కడ ఇన్‌ఛార్జిని కూడా పెట్టలేదు. అయితే బలమైన నేతలపై ఆశలు.. మారిన రాజకీయ సమీకరణల నేపథ్యంలో ఇప్పుడు ఏ స్థానం కేటాయించాలనేదీ స్పష్టతకు రాలేకపోతున్నారు. అద్దంకి సమీపంలో ఈ నెల 10న జాతీయరహదారిపై సిద్ధం పేరుతో వైసిపి భారీ బహిరంగసభకు సన్నాహాల్లో ఉంది. పార్టీ నేతలందరూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏర్పాట్లపై విజయ సాయిరెడ్డి ఆయా జిల్లాల నేతలతో ఒంగోలులో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు టిడిపి అధినేత చంద్రబాబు కూడా అదే రోజున మార్కాపురం రానున్నారు. ఈ లోపు లోకేష్ శంఖారావం పేరుతో జిల్లాలో పర్యటించనున్నారు. ఇలా అగ్రనేతల సభలూ రాజకీయ వేడిని పెంచుతున్నాయి.



ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో ఉన్నప్పటికీ పరీక్షలకు తగిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు కల్పించారు. పరీక్షా కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేస్తున్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండానే చూస్తున్నారు. పరీక్షలు సజావుగా సాగేలా చూడాలి. ఎన్నికలు, రాజకీయ సభలకు బస్సులను లాగేయడంతో విద్యార్థులు అవస్థలు పడే అవకాశాలున్నాయి. ఆర్టీసీ కూడా విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని బస్సులను పార్టీలకు అద్దెకు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. విద్యుత్ శాఖ కూడా కరెంటు పోకుండా చూడాల్సిన అవసరం ఉంది. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాసేలా కేంద్రాలకు సమీపంలో మైకు శబ్దాలు లేకుండా యంత్రాంగం చూడాలి.

తాగునీటి కోసం పలు చోట్ల మహిళలు రోడ్డెక్కుతున్నారు. వేసవి వస్తోంది. తాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చుతోంది. పశ్చిమాన ఈ పాటికే రోజూ ఎక్కడో చోట మహిళలు నీళ్ల కోసం ఆందోళనలు చేపడుతున్నారు. తాజాగా తర్లుపాడు సమీపంలో మహిళలు బిందెలతో రోడ్డెక్కారు. తాగునీటిని సరఫరా చేసినందుకు బిల్లులు ఇవ్వడం లేదు. కాంట్రాక్టర్ల ఒత్తిడి పెరిగింది. దీంతో నీటి సరఫరాను ప్రభుత్వం ఆపేసింది. బోర్లు, బావులు, నీటి పథకాలకు నీళ్లందని ప్రాంతాల్లో జనం ఇబ్బందులు పడుతున్నారు. వచ్చే వేసవిలో నీటి కష్టాలు ఇంకా పెరుగుతాయి. అయితే కుడికాలువకు తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేశారు. దాన్ని సక్రమంగా చెరువులకు నింపితే వేసవిలో దాహం తీర్చుతుంది. సంబంధిత శాఖ అధికారులు నీరు జిల్లాకు వచ్చేలోపు దాన్ని చెరువులకు నింపే చర్యలు తీసుకోవాల్సి ఉంది.